ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
బాపట్ల జిల్లా వార్తలు
5
సోమవారం 15 జూలై 2024




బాపట్ల మున్సిపల్ కార్యాలయం సమీపంలో తవ్వకాల్వలో పెరిగిన తుంగ, నిలిచిన మురుగు

మురుగు బురద

వానొస్తే.. వణుకే.. పట్టణాల్లో ఇదీ పరిస్థితి. వాన ఆ వెంట వచ్చే బురద.. ఆ తర్వాత రోడ్లపై పేరుకుపోయే బురదతో ప్రజలు అల్లాడుతుంటారు. మురుగుతో కలిసే బురదకు తోడు చెత్తాచెదారాలు పేరుకుపోయి దోమలు, దుర్వాసన తో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటారు. అసలే అంతంతమాత్రంగా ఉండే పారిశుధ్యం.. వర్షాలు పడిన ప్పుడు మరింత అధ్వానంగా మారుతుంది. మున్సిపల్ కేంద్రాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉండ టంతో ఓ మోస్తరు వర్షాలకే రహదారులు తటాకాలను తలపిస్తుంటాయి. వర్షపు నీరు పోయేంత సామర్థ్యం లేకపోవడంతో వాన నీటితో కలిసిన మురుగు రోడ్లపైకి చేరుతుంది. వర్షాకాలంలో తలెత్తే ఇబ్బందులు గురించి తెలి సినా మున్సిపల్ పాలకులు, అధికారులు పరిష్కారాలపై నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. దీనికితోడు గత ఐదేళ్లు వైసీపీ పాలనలో మున్సిపాల్టీల్లోని సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ప్రస్తుతం పలు పట్టణప్రాంతాల్లో ప్రజలు అంటువ్యాధులతో అల్లాడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం డ్రెయినేజీ వ్యవస్థను పాడు పెట్టడం, అవుట్‌ఫాల్ డ్రెయిన్ల అభివృద్ధికి నిధులు వెచ్చించకపోవడంతో ప్రస్తుతం మున్సిపల్ ప్రజలకు శాపంగా మారింది.

- మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తం
- మున్సిపల్ కేంద్రాల్లో అధ్వానపు డ్రెయిన్లు
- ఓ మోస్తరు వర్షానికే పొంగిపొర్లే కాల్వలు
- దోమలు, దుర్వాసనతో అల్లాడుతున్న ప్రజలు
- క్షీణిస్తున్న పారిశుధ్యం.. వ్యాపిస్తున్న వ్యాధులు
- ఐదేళ్లు పట్టణాలను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం


మాచర్ల: శ్రీనివాస థియేటర్ వద్ద రోడ్డుపైకి చేరిన మురుగు

బాపట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి):అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి కురు స్తున్న ముసురు వర్షాలతో మున్సిపల్ పట్టణాల్లో పారి శుధ్యం ఎంత అధ్వానంగా ఉందో బహిర్గతమైంది. జిల్లా కేంద్రాలైన గుంటూరు, బాపట్ల, నరసరావుపేటల్లో ప్రధాన రహదారులు కూడా మురుగు, బురదతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. ఇక ఆయా జిల్లాల్లోని మున్సిపల్ పట్టణాల్లో వర్షాలు పడినప్పుడల్లా పారిశుధ్యం అధ్వానంగా మారుతుంది. దీంతో ప్రజలు వర్షాలు పడుతున్నాయంటే భయాందోళనలు వ్యక్తం చేస్తుంటారు. మురుగు, బురద, దోమలు, దుర్వాసనలు.. ఆపై రోగాలతో ప్రజలు అల్లాడిపోవాల్సిందే. అస్తవ్యస్త పారిశుధ్యంతో డయేరియాలాంటి వ్యాధులు ప్రబలి ప్రజలు ఆస్పత్రుల బాట పడుతున్నారు. ఎప్పటికప్పుడు చెత్త తొలగించకపోవడంతో వర్షాలు కురిసినప్పుడల్లా వ్యర్థాలు రోడ్ల మీదకు వస్తున్నా యి. దీంతో పట్టణాలు మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి. పట్టణ ప్రాంతాలను ప్రధానంగా డ్రెయినేజి సమస్య పట్టిపీడిస్తున్నది. ఉన్న డ్రెయినేజీలు పూడికతో నిండిపోయాయి. తుంగ, వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ముందుకెళ్లే పరిస్థితి లేదు. దీనివల్ల ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతున్నది. పారిశుధ్యం అధ్వానంగా మారి చినుకులు పడుతున్న నేపథ్యంలో ప్రజలు జ్వరాలు, వాంతులు, వీరోచనాల తో ఆస్పత్రులు బాట పట్టాల్సి వస్తోంది. వర్షాలు పడినప్పుడల్లా మీడియం, మైనర్ డ్రెయిన్ల నుంచి వచ్చే మురుగు మేజర్ డ్రెయిన్ గుండా ప్రవహించకపోవడంతో అనేక చోట్ల మురుగు ఉబికి రోడ్లమీదకొస్తున్నది.


బాపట్ల కొత్తబస్టాండ్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు డ్రైనేజీలోకి వెళ్లకుండా ఉన్న దృశ్యం.


బాపట్ల :పాతకోర్టుభవనం ఎదురు కాల్వలో ముందుకు సాగని మురుగునీరు

- పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పుర పాలక సంఘాలలో వరద, మురుగు నీటి కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డు మార్జిన్లలో వర్షపు నీరు నిలిచిపోతున్నది. దోమల వ్యాప్తి ఉధృతం కానున్నది. అంటువ్యాధులు ప్రబలుతాయన్న ఆందోళన సర్వత్రా నెల కొంది. వర్షాకాలం ముందస్తు పనులు చేపట్టడాన్ని పురపాలకులు విస్మరించారు. భారీ వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాలు పట్టణాల్లో ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. గత అనుభవాలను పరిశీలనలోకి తీసుకుని వరద నీరు గృహాల్లోకి ప్రవేశించకుండా పూర్తిస్థాయి చర్యలు చేపట్టాల్సి ఉంది. వర్షాలు కురుస్తున్నా పురపాలకులు అలస త్వాన్ని వీడటంలేదు. వర్షాల సమయంలో ముంపు బాధితులకు పరిహారం అందించే కన్నా ఇళ్లు ముంపునకు గురవ్వకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం మిన్న అనే అంశాన్ని అధికారులు విస్మరిస్తున్నారు.

దీనివల్లే ఏటా పేదలు పట్టణాల్లో వరద ముంపు కష్టాల ను ఎదుర్కొంటున్నారు. అధికారం అండతో కాల్వలపై అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఏ ఒక్క మున్సిపాల్టీలో కూడా కాల్వలపై ఆక్రమణలు తొలగింపునకు ప్రయత్నాలు జరగడంలేదు. కాల్వలు, డ్రెయిన్లు ఆక్రమణలతో కుచించుకు పోవడంతో వర్షాలు కురిస్తే నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. వరద నీటి కాల్వలను పునరుద్ధరించకుంటే వర్షాలు కురిసినప్పుడల్లా పల్లపు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ముంపు కష్టాలు తప్పవు. వరద, మురుగు కాలుల్లో పూడిక తీత తక్షణావసరంగా ఉన్నా ఈ దిశగా పురపాలకులు స్పందించడంలేదు.

ప్రత్యేక శ్రద్ధపెట్టాలి..

ఐదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురైన మున్సిపాలిటీలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అధ్వానంగా మారిన మురుగునీటి పారుదల వ్యవస్థను తక్షణం సంస్కరించాల్సిన అవసరం ఉంది. డ్రెయినేజీల్లో పూడికలు తీసి వరద నీరు నిల్వకుండా చేయాలి. మురుగు కాలువల్లో పూడిక తీయాలని ఇటీవల మున్సిపల్ మంత్రి నారాయణ అధికారులను ఆదేశించినా వారు మొద్దు నిద్ర వీడటం లేదన్న విమర్శలున్నాయి. ప్రతి మున్సిపాల్టీ లో వేసవిలోనే మురుగునీటి వ్యవస్థను గాడిలో పెట్టాల్సి ఉంది. వర్షాకాలంలో ప్రజలకు వరద నీటి ఇబ్బం దులు లేని విధంగా చర్యలు చేపట్టాలి. వర్షాలు కురవక ముందే పురపాలక సంఘాలలో ముంపు నివారణకు అవసరమైన పనులు పూర్తి చేయాలి. భారీ వర్షాలు కురిస్తే పల్లపు ప్రాంతాలు ముంపునకు గురవ్వకుండా ప్రధాన మురుగు కాలువల్లో పూడిక తీత చేపట్టాలి. గతంలో ఏఏ ప్రాంతాలు వరదనీటితో ముంపునకు గురయ్యాయో గుర్తించి ఆయా ప్రాంతాలలో వరద నీటి కాలువలను అభివృద్ధి చేయాలి. పూడి పోయిన కాల్వలను పునరుద్ధరించాలి. వరద నీరు సులువుగా కాలువల్లో ప్రవహించే విధంగా చర్యలు చేపట్టాలి.

ఐదేళ్లు పాడుపెట్టారు

మున్సిపాలిటీల్లో మురుగు, పారిశుధ్యం, డ్రెయినేజీల నిర్వహణపై ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం కనీసంగా కూడా దృష్టిపెట్టిన పాపాన పోలేదు. పల్లపుప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరుతున్నా కన్నెత్తి చూడలేదు. గత ప్రభుత్వాలు ప్రారంభించిన వరద, మురుగునీటి కాల్వలను పాడుపెట్టారు. ప్రధాన కాల్వల్లో కనీసం పూడిక తీసే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో చిన్నపాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. కాల్వల్లో చెత్త పేరుకుపోయి వానలు కురిసినప్పుడు తీవ్ర దుర్గంధం వస్తున్నా తమకు సంబంధం లేదన్నట్లుగా మున్సిపల్ అధికారులు, పాలకులు వ్యవహరించారు. దీంతో దోమలు, దుర్వాసన, అంటువ్యాధులతో ప్రజలు అల్లాడిపోవడం పరిపాటిగా మారింది. ఏ మున్సిపాలిటీలోనూ రూపాయి నిధులు లేకుండా ఊడ్చేసి ఖాళీ ఖజానాను వైసీపీ అప్పగించింది. బాపట్ల మున్సిపాలిటీనే దాదాపు రూ.11 కోట్ల లోటు బడ్జెట్‌తో ఉండడం మున్సిపాలిటీల దీనావస్థకు అద్దం పడు తోంది.

డ్రెయిన్లపై రూపాయి ఖర్చు లేదు..

ఐదేళ్ల వైసీపీ పాలనలో డ్రెయినేజీలపై వైసీపీ ప్రభుత్వం కనీస స్థాయిలో కూడా ఖర్చుపెట్టలేదు. ప్రజలు ఇక్కట్లు పడు తున్నా పట్టించుకోకుండా మున్సిపాలిటీ నిధులను సైతం పక్కదారి పట్టించింది. వాగు లు, కాలువల వెంట ఉన్న ఆక్రమణలు తొలగించి వర్షపు నీరు ఇళ్లలోకి రాకుండా చూడాలని గతంలో పలుమార్లు ప్రజలు స్పందనలో ఇచ్చిన అర్జీలన్నీ బుట్టదాఖల య్యాయి. ప్రజల నుంచి ఆస్తి పన్నును ముక్కుపిండి వసూలు చేసే మున్సిపాలిటీ మౌలిక వసతులను కల్పించడంపై మాత్రం దృష్టిపెట్టలేదు. ఆస్తి పన్ను రూపేణా వచ్చే నిధులను దారి మళ్లించారు తప్పితే ప్రజల అవస్థలను పట్టించుకోలేదు.

అతిసార కేసులు నమోదు

పట్టణాల్లో అతిసారం కేసులు నమోదవు తున్నాయి. మరణాలు కూడా సంభవిస్తున్నాయి. గుంటూరు, తెనాలి, పిడుగురాళ్ల పట్టణాల్లో అతిసార వ్యాప్తి చెందిన విషయం తెలిసిందే. పిడు గురాళ్లలో డయేరియా మరణాలు చోటు చేసుకున్నాయి. ఒక వైపు అతిసారం కేసులు నమోదు అవుతు న్నా పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించడంలేదు. వర్షం కురిస్తే పట్టణాలు చిత్తడి చిత్తడిగా మారుతున్నా యి. రోడ్డు మార్జిన్‌లలో నీరు నిలిచి అధ్వానంగా మారుతున్నాయి. ఇప్పటికైనా పురపాలకులు అప్రమత్తమై ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి.


చీరాలలో ముక్కోణపు పార్కు రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

కాల్వల నిర్మాణాలు నై

బాపట్లలో రోడ్డు విస్తరణలో భాగంగా వైసీపీ నేతల ప్రాపకం కోసం దానిని ఇష్టారీతిన వంకర్లు తిప్పారు. దీంతో మెయిన్ రోడ్డు మీదే నీళ్లు నిలబడి వాహనదారులకు, ప్రజలు నరకం చూస్తున్నారు. అరకొరగా చేపట్టిన రహదారుల విస్తరణలో భాగంగా పడగొట్టిన మురుగుకాలువలను సైతం తిరిగి నిర్మించలేదు. దెబ్బతిన్న కాల్వలు పూడిపోయాయి. బాపట్ల చీలురోడ్డు సెంటర్ మొదలు రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల వరకు చిన్నపాటి వర్షానికే చెరువులను తలపిస్తున్నాయి. రేపల్లె పరిధిలోని పాత స్టేట్‌బ్యాంకు రోడ్డులో రోడ్డు తటాకాన్ని తలపిస్తుంది.

చీరాలలోని బస్టాండ్ సెంటర్‌తో పాటు మార్కెట్ పరి సర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ చెత్త పేరు కుపోయి వర్షాల దెబ్బకి అదంతా కుళ్లి దుర్వా సన గుప్పుమంటోంది. జిల్లాలోని మూడు మున్సిపా లిటీల పరిధిలో గత ప్రభుత్వంలో నీటి కాల్వల నిర్మాణం కోసం దాదాపు రూ.15 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించగా ఐదేళ్లుగా అవేవీ పట్టాలెక్కకపోగా మున్సిపాలిటీల్లో ఉన్న నిధులన్నింటినీ దారి మళ్లించి వాటిని కునారిల్లేలా చేశారు.


రేపల్లె : బసవేశ్వర థియేటర్ పక్క రోడ్డులో నిలిచిన వర్షపు నీరు


రేషన్ లొసుగులు బహిర్గతం


రేషన్ సరుకుల పంపిణీని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

- మంత్రి మనోహర్ తనిఖీల్లో వెలుగులోకి
- సరకుల పంపిణీ వాహనంలో కార్డుల గుట్టలపై ఆగ్రహం
- బియ్యం పంపిణీ కంటే నిల్వలే ఎక్కువపై నాదెండ్ల ఆశ్చర్యం
- వాహనాన్ని వదిలేసి పారిపోయిన ఓ ఎండీయూ ఆపరేటర్

తెనాలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీ వాహనంలోనే గుట్టలుగా కార్డులు.. పంపిణీ చేసిన వాటికంటే వాహనంలో ఉన్న బియ్యం నిల్వలు ఎక్కువగా ఉన్నాయి.. విక్రయ కేంద్రంలోనూ అదనపు బియ్యం మూటలు, ఇతర సరుకులు.. ఇవన్నీ ఆదివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీల్లో బహిర్గతమైన విషయాలు. వీటిని చూసిన మంత్రి విస్తుపోయి, వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపిన మంత్రి ఆదివారం తన సొంత నియోజకవర్గంలోనూ రేషన్ పంపిణీ తీరును ప్రత్యేకంగా తనిఖీ చేశారు. మంత్రి తనిఖీల సమాచారం తెలుసుకున్న తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ కూడా పాల్గొన్నారు. మొదట బుర్రిపాలెం రోడ్డులోని రైతుబజార్‌లో బియ్యం, కంది పప్పు దుకాణాన్ని పరిశీలించేందుకు మంత్రి వచ్చారు. అయితే ఒక దుకాణం మూసి ఉండటంతో ఆయన మండిపడ్డారు. పైగా సబ్‌కలెక్టర్ ప్రారంభించిన దుకాణం ఎలా ఉందనేది కూడా పరిశీలించరా అంటూ అధికారులపై మండిపడ్డారు. మరో దుకాణంలో నాణ్యమైన బియ్యంతోపాటే తక్కువ రకం బియ్యం ఉండటాన్ని చూసి ప్రశ్నించారు. వ్యాపారి పొంతనలేని సమాధానంతో రెండు దుకాణాలపై విచారణకు ఆదేశించారు. రెండో దుకాణాన్ని మాత్రం సీజ్ చెయ్యాలని ఆదేశించారు. ఆ తర్వాత పినపాడు దగ్గర రేషన్ పంపిణీ చేస్తున్న వాహనాన్ని గమనించిన మంత్రి అక్కడ ఆగారు.

సరుకులు పంపిణీ చేసిన పరిమాణాన్ని పరిశీలించారు. దానిలో పాత కార్డులతోనే రేషన్ పంపిణీ చేస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దానిని పరిశీలించాలని సబ్‌కలెక్టర్‌ను ఆదేశించారు. మఠంబజార్‌లో రోడ్డుపక్కన ఎండీయూ వాహనం ఉండటం, తలుపులు తెరిచి ఉండటంతో దానిపై అనుమానం వచ్చి పరిశీలించారు. లోపల సంచిలో లబ్ధిదారుల కార్డులు గుట్టలుగా ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకుని విచారణ జరపాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. తనిఖీల సమాచారం తెలిసి ఆపరేటర్ వాహనాన్ని అక్కడ నిలిపి వెళ్లి ఉంటాడన్న కోణంలో పరిశీలించాలని తెలిపారు. మరో వాహనాన్ని పరిశీలించారు. ఆ తర్వాత రైతుబజార్‌లో కూరగాయల ధరలను పరిశీలించారు. అయితే బయట మార్కెట్‌లో కిలో టమోటా రూ.40 ధర ఉంటే, రైతు బజార్‌లో రూ.52కు అమ్మడంపై దుకాణదారుడ్ని, సూపర్‌వైజర్‌ను మంత్రి ప్రశ్నించారు. రిజిష్టర్‌ను పరిశీలించి వ్యత్యాసం ఉండటంతో పనితీరు సరిగాలేదని సూపర్‌వైజర్‌పై చర్యలకు ఆదేశించారు.


వాహనంలో రేషన్ కార్డుల గుట్టలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

నల్లమడ..ఆధునికీకరణ ఎప్పటికో?

- దశాబ్దాలుగా రైతులను పట్టిపీడిస్తున్న సమస్య
- వరద సమయంలో పెద్దఎత్తున ముంపుతో నష్టం
- వైసీపీ నేతల తవ్వకాలతో బలహీనంగా డ్రెయిన్ కట్టలు

బాపట్ల, జూలై 14: ప్రభుత్వాలు మారుతున్నాయి.. నేతల హామీలు నీటిమూటలుగానే మిగులుతున్నాయి.. కానీ నల్లమడ డ్రెయిన్ దుస్థితి మాత్రం మారడంలేదు. గండ్లు.. ముంపుతో బాపట్ల పరిసర ప్రాంత ప్రజలు, రైతుల పాలిట దుంఖదాయనిగా మారిన నల్లమడ డ్రెయిన్ దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోవడంలేదు. బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో కలిసే నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణ కూటమి ప్రభుత్వంలో అయినా జరుగుతుందా అని రైతులు ఎదురుచూస్తున్నారు. తుఫాన్లు, భారీవర్షాల సమయంలో వరదలకు డ్రెయిన్ కట్టలు బలహీనంగా మారి గండ్లు పడటం, వేలాది ఎకరాలు ముంపునకు గురికావటం పరిపాటిగా మారుతోంది. బాపట్ల మండలం జిల్లెళ్లమూడి గ్రామం వద్ద రెండేళ్లకు ఒకసారి గండ్లు పడి పొలాలతోపాటు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. రాజశేఖర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో నల్లమడ డ్రెయిన్ నష్టాన్ని పరిశీలించి ఆధునీకరణకు చర్యలు చేపడతామని హామీలు ఇచ్చారు. అయితే నామమాత్రపు పనులతో సమస్యను పూర్తి స్థాయిలో ఎవరూ పరిష్కరించలేదు. దీంతో ఎగువప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు అంతా నల్లమడలో ప్రవహించి దిగువ ప్రాంతమైన బాపట్ల మండలంలోని అనేక గ్రామాలు ముంపునకు కారణమౌతున్నది. ఏటా డ్రెయిన్ పరివాహక ప్రాంతంలో ఉన్న రైతులు ఎంతోకొంత పంట నష్టపోవాల్సి వస్తున్నది. దీనిపై నల్లమడరైతు సంఘం నాయకులు అనేక ఉద్యమాలు కూడా చేశారు. ప్రతిసారి కలెక్టర్‌కు వినతులు అందజేస్తూనే ఉన్నారు. గత వైసీపీ పాలనలో నల్లమడ అభివృద్ధి విషయంలో పూర్తి స్థాయి నిర్లక్ష్యం కనిపించింది. అప్పికట్ల, నందిరాజుతోట, పిన్నిబోయనవారిపాలెం గ్రామాల్లో డ్రెయిన్ కట్టలను వైసీపీ శ్రేణులు తవ్వి మట్టి, ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్నారు. దీనిపై నల్లమడరైతు సంఘం, బహుజనసమాజ్‌పార్టీవారు ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో కట్టలు బలహీనపడి ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో డ్రెయిన్ పొంగితే సాగుకు ఇబ్బందులు తలెత్తుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లెళ్ళమూడి వద్ద బలహీనంగా ఉన్న నల్లమడ డ్రెయిన్ కట్ట



నల్లమడ కట్టలు తెగి ముంపునకు గురైన పొలాలు (పాతచిత్రం)

జిల్లెళ్ళమూడి ప్రాంతంలో మేటలు

బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామ సమీపంలో నల్లమడ డ్రెయిన్ అనేక మలుపులుగా ఉంటుంది. దీనివల్ల కాల్వ కట్టలు సైతం కరిగిపోయి మట్టికారి కాల్వలో మేటలు వేసింది. ఎండాకాలంలో మట్టి మేటలపై ముళ్ళ మొక్కలు మొలిచి చెట్లుగా పెరిగి నీటి ప్రవహానికి అడ్డంకిగా మారాయి. ఓవైపు మట్టి మేటలు, మరోవైపు ముళ్ళచెట్లకు తోడు బలహీనంగా ఉన్న కట్టల వల్ల ఎప్పుడు ఏవిధమైన ముంపు సంభవిస్తుందోనని రైతులు భయపడుతున్నారు.



7లో..

ఆక్వాపార్కుకు 192 ఎకరాల స్థలాన్ని సేకరిస్తున్నాం

- నిజాంపట్నం హార్బర్ అభివృద్ధి పనులు, మడ అడవుల పరిశీలన
- కలెక్టర్ వెంకటమురళి

మడ అడవులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, ఆర్డీవో రవీంద్ర

దిక్సూచి DIKSUCHI

కొత్త క్రిమినల్ చట్టాలు

కొత్త దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి డెబ్బై ఏళ్ల పైమాటే అయినా ఇంకా వలస పాలన కాలం నాటి వందేళ్లకు పైగా పాతవైన పురాతన శిక్షా స్మృతులనే భారతదేశం అనుసరిస్తోంది. నేరాలు సంతరించుకున్న ఆధునిక రూపును న్యాయవ్యవస్థ అందుకోలేకపోవడంతో ఫిర్యాదులు, సాక్ష్యాధారాల సేకరణ, నేర విచారణల్లో జాప్యం అనివార్యమౌతోంది. 'జస్టిస్ డిలేయ్‌డ్ ఈజ్, జస్టిస్ డినైడ్' (న్యాయం ఆలస్యమవడం అంటే న్యాయాన్ని నిరాకరించడమే) అని లోకోక్తి. అందుకే పరిస్థితులకు అనుగుణంగా చట్టాలు మారాల్సి ఉంది. ఈ కోవలోనే క్రిమినల్ నేరాలకు సంబంధించిన మూడు ప్రధాన చట్టాలైన

- 'ఇండియన్ పీనల్ కోడ్'(భారతీయ శిక్షాస్మృతి),
- 'క్రిమినల్ ప్రొసీజర్ కోడ్'(నేర విచారణ స్మృతి),
- 'ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్'(భారతీయ సాక్ష్యాధార చట్టం)లను పూర్తిగా సంస్కరించారు.

వీటిని ఆధునిక పేర్లతో 2024 జూలై 1 నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. ఈ తేదీ తరవాత జరిగిన అన్ని నేరాలకు ఈ నూత న చట్టాలు వర్తిస్తాయి. ఈ నేపథ్యంలో ఆ చట్టాల్లో తెచ్చిన స్థూలమైన మార్పులకు సంబంధించిన ప్రధానాంశాలపై అవగాహన తప్పనిసరి.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)-2023

ఇది ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ)-1860 స్థానంలో వచ్చిన అధునాతన చట్టం. గతంలో ఐపీసీలో 511 సెక్షన్లు ఉండగా ప్రస్తుతం బీఎన్ఎస్‌లో 356 సెక్షన్లు ఉన్నాయి. మొత్తం 175 పాత సెక్షన్లను మార్చి 8 కొత్త సెక్షన్లు ప్రవేశపెట్టారు. 22 సెక్షన్లను సమూలంగా రద్దు చేశారు.

కీలకాంశాలు

బీఎన్ఎస్ ప్రకారం 'మూకదాడి'ని ఒక శిక్షార్హ నేరంగా పరిగణిస్తూ విపులీకరించారు. అయిదుగురు లేదా అంతకన్నా ఎక్కువమంది జాతి, మత, వర్గ తదితర ప్రాతిపదికల మీద విద్వేషపూరిత హత్య లేదా తీవ్రంగా గాయపరచినపుడు దానిని మూకదాడిగా పరిగణిస్తూ జీవితఖైదు లేదా మరణ శిక్ష విధిస్తారు.

రాజద్రోహం అనే నేరాన్ని శిక్షాస్మృతి నుంచి రద్దు చేసి 'దేశద్రోహం'అనే నేరాన్ని విశదీకరించి శిక్షార్హం చేశారు. టెర్రరిజం, వేర్పాటువాదం, సాయుధ తిరుగుబాటు, విధ్వంసకర కార్యకలాపాలకు పాల్పడడం, అటువంటి కార్యకలాపాలను ప్రోత్సహించడం; దేశ సార్వభౌమాధికారం, ఐక్యత, భద్రత, సమగ్రతలకు భంగం కలిగించడం వంటి చర్యలను దేశ ద్రోహంగా పరిగణిస్తారు.

పద్దెనిమిదేళ్ల కంటే తక్కువ వయసున్న బాలికతో జరిపిన లైంగిక చర్యను ఆమె అంగీకారం ఉన్నప్పటికీ, వివాహిత అయినప్పటికీ లైంగికదాడిగానే పరిగణిస్తారు. దీనిని శిక్షార్హమైన నేరంగా సూచించారు. పద్దెనిమిదేళ్లలోపు బాలికపై సామూహిక అత్యాచారానికి మరణదండన విధించవచ్చు.

నిజాలు దాచి వివాహం చేసుకోవడం, మభ్యపెట్టడం; ఉద్యోగం, ప్రమోషన్ వంటి ప్రలోభాలతో లొంగదీసుకొని లైంగికచర్య జరపడం వంటివాటిని నేరాలుగా పరిగణిస్తూ పదేళ్లవరకు జైలుశిక్ష, జరిమానా విధించవచ్చు.

స్నాచింగ్(బలవంతంగా లాక్కొనిపోవడం)ను దొంగతనంలో భాగంగా చూడడానికి బదులు ప్రత్యేక నేరంగా పరిగణిస్తూ ఈ శిక్షాస్మృతిలో చేర్చారు. వ్యవస్థీకృత నేరాలు అనే ప్రత్యేక విభాగంలోకి కిడ్నాప్‌లు, ఆర్థిక నేరాలు, సైబర్ నేరాలు, దోపిడీలు, భూకబ్జాలు, కాంట్రాక్ట్ హత్యలు, వాహనాల చోరీ వంటివాటిని చేర్చారు. నేర తీవ్రతను బట్టి శిక్షలు విధిస్తారు.

ప్రభుత్వాధికారుల విధి నిర్వహణకు అడ్డుపడే నిమిత్తం చేసిన ఆత్మహత్యా ప్రయత్నాన్ని నేరంగా పరిగణిస్తారు. ఆత్మహత్యకు ప్రయత్నించడం వంటి కొన్ని స్వల్ప నేరాలకు 'సామాజిక సేవ'ను శిక్షగా విధించడం వంటి వినూత్న అంశాలను నూతన న్యాయస్మృతిలో చేర్చారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇతరుల మరణానికి కారణమవడం కూడా శిక్షార్హనేరంగా పరిగణించారు. ఈ నేరానికి రెండు నుంచి అయిదేళ్ల వరకు అదే వైద్యులకైతే రెండేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. తప్పుదోవ పట్టించే లేదా అసత్య వార్తలను ప్రచురించడం కూడా శిక్షార్హ నేరంగా సూచించారు. కొన్ని సెక్షన్లను బాలలకు సంబంధించిన అంశాలున్నవాటిని లింగ సమానత్వం దృష్ట్యా అన్ని లైంగికవర్గాలకు వర్తించేలా సవరించారు. అసహజ లైంగిక చర్య నిర్వచనం నుంచి 'స్వలింగ సంపర్కం'ను తొలగించి, నేరం కాదని తీర్మానించింది.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

విమర్శలు

- భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లో బాలలు అంటే పద్దెనిమిదేళ్లలోపు వారిగా నిర్వచించడం వల్ల కొన్ని సెక్షన్ల అమలులో సందిగ్ధత తలెత్తనుంది. ఉదాహరణకు అత్యాచారం, సామూహిక అత్యాచారం వంటి అంశాల్లో వయో వ్యవధుల పరంగా సెక్షన్ల మధ్య సంఘర్షణ ఏర్పడవచ్చు.
- జస్టిస్ వర్మ కమిటీ సూచించిన విధంగా అత్యాచారాన్ని జెండర్ న్యూట్రల్(లింగసమానత)గా పరిగణించడం, మ్యారిటల్ రేప్‌ను నేరంగా సూచించడం వంటి అంశాలను నూతన న్యాయ సంహిత విస్మరించిందని; అత్యాచారం, లైంగిక వేధింపులకు సంబంధించి పాత ఐపీసీలోని అంశాలనే కొనసాగించారనీ పలు వర్గాలు విమర్శిస్తున్నాయి.
- క్రిమినల్ రెస్పాన్సిబిలిటీ ఏజ్ అంటే ఒక చర్య నేరం అని గ్రహించే వయసును ఏడేళ్లుగా, మానసిక పరిపక్వత ఆధారంగా పన్నెండేళ్ల వరకూ పరిగణించే విధంగా నిర్ణయించడం అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రమాణాలతో విభేదించేలా ఉంది.
- కొన్ని సెక్షన్లలో తప్పనిసరి కనీస శిక్షను నిర్ణయించారు. ఇది న్యాయమూర్తుల విచక్షణాయుత తీర్పులకు ఆటంకం కావచ్చు.
- కమ్యూనిటీ సర్వీస్(సామాజిక సేవ)ను కొన్ని స్వల్ప తప్పిదాలకు శిక్షగా నిర్ధారించారు. అయితే ఒక చట్టం శిక్షల పరంగా ప్రతి అంశాన్నీ కూలంకశంగా వివరిస్తుంది. కానీ సామాజిక సేవ అంటే ఏంటో ఇతమిద్ధంగా ప్రస్తావించకపోవడం మాత్రం చట్టంలోని ప్రధాన లోపంగా చెప్పవచ్చు.
- క్లాజ్- 69లో మభ్యపెట్టడం, ప్రలోభపెట్టడం ద్వారా లైంగిక చర్య జరపడం అనే అంశం సహజీవనం, పరస్పర అంగీకారం వంటి సందర్భాల్లోనూ దుర్వినియోగమయ్యేందుకు అవకాశాలు ఉన్నాయని విమర్శలు వస్తున్నాయి.
- అనేక నేరాలకు మరణ శిక్ష ఉండడం కూడా పెద్ద ఎత్తున మానవ హక్కుల వర్గాల నుంచి, ప్రపంచవ్యాప్త హక్కుల సంస్థల నుంచి నిరసనలకు కారణమవుతోంది.
- వేర్పాటువాదం; దేశ సమగ్రతకు, ఐక్యతకు, భద్రతకు భంగం కలిగించడం వంటి దేశద్రోహ నిర్వచన అంశాలు ప్రత్యేక రాష్ట్రాల వాదనలను, హక్కుల కోసం జరిపే నిరసనలను కూడా ఈ నేరపరిధిలోకి తీసుకొచ్చే విధంగా ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి.

దిశలు - దూరాలు

రీజనింగ్

పార్ట్-2

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం


ముఖ్యరేఖాచిత్రం

1. సుమ ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లాలనుకున్నది. ఆమె తన ఇంటి నుంచి ఉత్తర దిశగా బయలుదేరింది. కొంత సమయం తరవాత ఎడమవైపునకు తదుపరి కుడివైపునకు చివరగా మరల ఎడమవైపునకు తిరిగి పాఠశాలకు చేరుకున్నది. అయితే ఆమె ఇంటి నుంచి పాఠశాల ఏ దిశలో ఉంది?

ఎ) ఈశాన్యం బి) నైరుతి సి) ఆగ్నేయం డి) వాయువ్యం

సమాధానం: (డి)

వివరణ:




పై రేఖాచిత్రం ప్రకారం సుమ, ఇంటి నుంచి పాఠశాల వాయువ్య దిశలో ఉన్నదని తెలుస్తుంది.

2. 100 కి.మీ. పొడవు గల ఒక రోడ్డుపై రెండు కార్లు చెరొకవైపు నుంచి వ్యతిరేక దిశలలో ప్రయాణిస్తున్నాయి. మొదటికారు 20 కి.మీ. ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 10 కి.మీ. ప్రయాణించింది. తదుపరి ఎడమవైపు తిరిగి 20 కి.మీ. ప్రయాణించిన తదుపరి ఎడమవైపునకు తిరిగి ప్రధాన రహదారి కి చేరుకున్నది. రెండో కారు చిన్న లోపం వల్ల 15 కి.మీ. మాత్రమే ప్రయాణించి ఆగిపోయింది. అయితే ఇప్పుడు రెండు కార్ల మధ్య దూరం ఎంత?

ఎ) 35 కి.మీ. బి) 45 కి.మీ. సి) 30 కి.మీ. డి) 40 కి.మీ.

సమాధానం: (బి)

వివరణ:



పై రేఖాచిత్రం ప్రకారం మొదటి కారు ప్రధాన రహదారికి చేరుకున్న తరవాత గమనించిన మొదటికారు ప్రధాన రహదారి పరంగా 40 కి.మీ. దూరాన్ని పూర్తి చేసుకున్నది. రెండో కారు అదే ప్రధాన రహదారి పరంగా మరొకవైపు నుంచి 15 కి.మీ. పూర్తి చేసినది. ఈ రెండింటిని కూడి మొత్తం నుంచి తీసివేస్తే రెండుకార్ల మధ్య దూరం తెలుస్తుంది.


100-(40+15) = 100-55=45 కి.మీ. సమాధానం అవుతుంది.

3. A, B, C, D, E అనే అయిదుగురు వ్యక్తులు ఒక వరుసలో నిల్చున్నారు. E అనే వ్యక్తి Bకి ఎడమవైపు 40మీ. దూరంలో ఉన్నాడు. A అనే వ్యక్తి Cకి ఎడమవైపు 20మీ. దూరంలో ఉన్నాడు. D అనే వ్యక్తి Eకి కుడివైపు 20మీ. దూరంలోను, Cకి కుడివైపు 50మీ. దూరంలోను ఉన్నాడు. అయితే A, Bల మధ్య దూరం ఎంత?

ఎ) 90 మీ. బి) 60 మీ. సి) 70 మీ. డి) 80 మీ.

సమాధానం: (ఎ)

వివరణ:




పై వివరణ ఆధారంగా A, Bల మధ్య దూరం 90 మీ. అని తెలుస్తుంది.

4. ఒక బాలుడు సైకిల్‌పై తూర్పునకు కొంత దూరం ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 2 కి.మీ. ప్రయాణించాడు. తదుపరి మరల కుడివైపునకు తిరిగి 3 కి.మీ. ప్రయాణించాడు. ఇప్పుడు అతను బయలుదేరిన స్థానం నుంచి దక్షిణంగా కచ్చితంగా 2 కి.మీ. దూరంలో ఉన్నాడు. అయితే ఆ బాలుడు మొదట్లో తూర్పునకు ఎంతదూరం ప్రయాణించాడు?

ఎ) 2 కి.మీ. బి) 4 కి.మీ. సి) 3 కి.మీ. డి) 5 కి.మీ.

సమాధానం: (సి)

వివరణ:




బయలుదేరిన స్థానానికి, చేరుకున్న స్థానం 2 కి.మీ. దూరంలో దక్షిణాన ఉంది. కాబట్టి పై డయాగ్రామ్‌ను పరిశీలిస్తే ఆ బాలుడు సైకిల్‌పై మొదట్లో తూర్పునకు 3 కి.మీ. ప్రయాణించాడని తెలుస్తుంది.

5. ఆనంద్ మ్యూజియానికి వెళ్లాలనుకున్నాడు. అతను తన ఇంటి నుంచి బయలుదేరాడు. అతని ఇల్లు దక్షిణదిశలో ఉంది. ఆ రోడ్డు కూడలి లేదా చౌరస్తాకు వచ్చిన తరవాత కుడివైపున పాఠశాల, ఎడమవైపున ఆటస్థలం ఉన్నది. అయితే మ్యూజియం ఏ దిశలో ఉంది?

ఎ) తూర్పు బి) పడమరసి) దక్షిణం డి) ఉత్తరం

సమాధానం: (డి)

వివరణ:




ఇటువంటి ప్రశ్నలలో ముఖ్య దిశలు(తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం)లో మిగిలి ఉన్నదే సమాధానం అవుతుంది.

6. సూర్యోదయం తరవాత విక్రమ్ ఒక స్తంభాన్ని చూస్తూ నిలుచున్నాడు. స్తంభం నీడ విక్రమ్‌కు కుడివైపున ఉన్నది అనుకుంటే విక్రమ్ ఇప్పుడు ఏ దిక్కును చూస్తూ నిలుచున్నాడు?

ఎ) పడమర బి) ఉత్తరం సి) తూర్పు డి) దక్షిణం

సమాధానం: (డి)

వివరణ: నీడ ప్రశ్నల్లో గుర్తించుకోండి. నీడ ఎప్పుడైనా సరే సూర్యునికి వ్యతిరేక దిశలో ఉంటుంది. అంటే ఉదయం సూర్యుడు తూర్పున ఉంటారు కాబట్టి ఉదయం పూట ఏదైనా వస్తువు నీడ, వ్యక్తి నీడ చెట్టునీడ గాని మరే నీడైనా గాని పడమర ఉంటుంది. సాయంత్రం పూట సూర్యుడు పడమర వైపున ఉంటాడు. (అస్తమించే సమయంలో) కాబట్టి సాయంత్రం పూట ఏ నీడైనా తూర్పున ఉంటుంది. గుర్తుంచుకోండి నీడ సూర్యునికి వ్యతిరేకంగా ఉంటుంది.





డాక్టర్ పండిటి మీనాక్షి పవన్, సీనియర్ ఫ్యాకల్టీ

ప్రశ్నలో నీడ విక్రమ్‌కు కుడివైపునకు ఉందని ఉన్నది. ఉదయంపూట కాబట్టి నీడ పడమరకు ఉంటుంది. దక్షిణ మునకు కుడివైపు పడమర అంటే విక్రమ్ దక్షిణానికి చూస్తూ నిలబడితే అతని కుడివైపు (పడమర) స్తంభం నీడ ఉందని అర్థం. విక్రమ్ కిందికి అనగా దక్షిణ దిక్కును చూస్తున్నాడు. ఇప్పుడు విక్రమ్‌కి కుడివైపు అంటే పడమర వైపు స్తంభం నీడ ఉంది.

మోదీ @ 10 కోట్లు

'ఎక్స్'లో ప్రధానిని ఫాలో అవుతున్న వాళ్ల సంఖ్య

- ఒబామా తర్వాత అంతమంది అనుసరిస్తున్న నేత
- క్రీడాకారులు, సెలబ్రిటీల కంటే ఆయనకే క్రేజ్
- సంతోషం వ్యక్తం చేస్తూ స్వీయ పోస్టు

న్యూఢిల్లీ, జూలై 14: 10 కోట్లు! భారత ప్రధాని నరేంద్రమోదీని 'ఎక్స్'లో ఫాలో అవుతున్నవారి సంఖ్య ఇది. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా(13 కోట్లు) తర్వాత ఈ మైలురాయిని చేరుకున్న మరో నేతగా, ప్రభావవంతమైన వ్యక్తిగా మోదీ నిలిచారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పలువురు సెలబ్రిటీలు, క్రీడాకారుల కంటే మోదీనే 'ఎక్స్'లో ఎక్కువ మంది ఫాలో అవుతుండటం విశేషం. అలాగే తన రాజకీయ ప్రత్యర్థులైన రాహుల్‌గాంధీ(2.64 కోట్లు), అరవింద్ కేజ్రీవాల్(2.75 కోట్లు), అఖిలేశ్ యాదవ్(1.90 కోట్లు), మమతాబెనర్జీ(74 లక్షలు) వంటి వారి కంటే ఫాలోవర్స్ విషయంలో ఆయన అందనంత ఎత్తుకు ఎదిగిపోయారు. అదేవిధంగా ప్రముఖ క్రీడాకారులు విరాట్ కోహ్లి(6.4 కోట్లు), నేమర్ జూనియర్(6.3 కోట్లు), లెబ్రోన్ జేమ్స్(5.2 కోట్లు)లను అలాగే టేలర్ స్విఫ్ట్(9.5 కోట్లు), లేడీ గాగా(8.3 కోట్లు), కిమ్ కర్దాషియన్(7.52 కోట్లు) వంటి సెలబ్రిటీలను సైతం అధిగమించారు. 10 కోట్ల మార్క్ చేరుకున్న సందర్భంగా మోదీ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. చర్చోపచర్చలకు, విమర్శలకు, ప్రజల ఆశీర్వాదాలకు నిలయమైన ఇటువంటి చైతన్యవంతమైన మాధ్యమంలో భాగమైనందుకు సంతోషంగా ఉందని పోస్టు చేశారు. కాగా, 2009లో 'ఎక్స్'లో ఖాతా తెరిచనప్పటి నుంచి ఇప్పటిదాకా ఈ మాధ్యమాన్ని ఆయన బాగా ఉపయోగించుకున్నారు. కార్యకర్తలను, పార్టీ శ్రేణులను, సహచర మంత్రులను ఉత్తేజపరుస్తూ, విపత్తులు, శుభాశుభాలు చోటుచేసుకున్నప్పుడు స్పందిస్తూ ముందుకు సాగుతున్నారు. గడిచిన మూడేళ్లలో సుమారు 30 కోట్ల మంది మోదీని 'ఎక్స్'లో ఫాలో అయ్యారు. ఇతర మాధ్యమాలైన యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో కూడా ఆయనను అనుసరించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం గమనార్హం. యూట్యూబ్‌లో మోదీకి 2.5 కోట్ల సబ్‌స్క్రైబర్స్ ఉండగా, ఇన్‌స్టాలో ఆయన 10 కోట్ల ఫాలోవర్లకు చేరువలో ఉన్నారు.

లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ లీడర్‌గా గౌరవ్ గొగోయ్

- స్పీకర్‌కు సీపీపీ చైర్‌పర్సన్ సోనియా లేఖ

న్యూఢిల్లీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపీ గౌరవ్ గొగోయ్‌కు ఆ పార్టీ మరో సారి అవకాశమిచ్చింది. చీఫ్ విప్‌గా సీనియర్ నేత కొడికున్నిల్ సురేశ్, విప్‌లుగా మాణిక్యం ఠాగూర్, మహమ్మద్ జావేద్‌లను నియమించింది. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియా గాంధీ లేఖ రాశారు. ఇదే విషయాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మార్గనిర్దేశంలో కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు ప్రజా సమస్యలపై సమష్టిగా పోరాడతాయని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటివరకు సురేశ్ (మావేలికర) కేరళ నుంచి 8 సార్లు ఎంపీగా గెలవగా.. మాణిక్యం ఠాగూర్ (విరుదునగర్) తమిళనాడు నుంచి 3 సార్లు, జావేద్ (కిషన్‌గంజ్) బిహార్ నుంచి 2 సార్లు గెలిచారు.

మణిపూర్‌లో సీఆర్పీఎఫ్ జవాను మృతి

ఇంఫాల్, జూలై 14: మణిపూర్‌లో జిరిబం జిల్లాలోని మాంగ్‌బంగ్ ప్రాంతంలో ఆదివారం ఉదయం భద్రతా బలగాలపై జరిగిన దాడిలో ఓ సీఆర్పీఎఫ్(సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్) జవాన్ మృతి చెందారు. దుండగులు తుపాకీతో కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. మరణించిన జవాన్‌ను బిహార్‌కు చెందిన అజయ్ కుమార్ ఝాగా అధికారులు గుర్తించారు. తలలో బుల్లెట్ దిగడంతోనే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో మరో పోలీసుకు గాయాలయ్యాయి. కుకీలకు చెందిన మిలిటెంట్లే ఈ దాడి చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.



తెరుచుకున్న జగన్నాథుడి రత్నభాండాగారం



ఖజానాను తరలించేందుకు సిద్ధంగా ఉంచిన చెక్కపెట్టెలు

- 46 ఏళ్ల తర్వాత తెరిచిన ఒడిశా ప్రభుత్వం
- రహస్య గదిలోకి ప్రవేశించిన 11మంది సభ్యులు
- ఖజానాను తరలించడానికి 6 చెక్క పెట్టెలు సిద్ధం
- బయటి గదిలోని సంపదను వాటిలోకి చేర్చి సీలు

పూరీ, జూలై 14: పూరీ క్షేత్రంలోని 12వ శతాబ్దానికి చెందిన జగన్నాథుడి ఖజానా రత్నభాండాగారం 46 ఏళ్ల తర్వాత తిరిగి తెరుచుకుంది. గది లోపల ఉన్న విలువైన వస్తువుల లెక్కింపుతో పాటు శిథిలావస్థకు చేరుకున్న నిర్మాణానికి మరమ్మతులు చేయడానికి ఖజానాను తెరిచినట్లు అధికారులు వెల్లడించారు. చివరిసారిగా ఈ ఖజానాను 1978లో తెరిచి, అందులోని సంపదను లెక్కించారు. అప్పట్లో రూపొందించిన జాబితా ప్రకారం రత్నభాండాగారంలోని రెండు గదుల్లో 128.380 కిలోల బంగారు ఆభరణాలు, 221.530 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం మధ్యాహ్నం 1.28 గంటల సమయంలో రహస్య గదిని తెరిచారు. జగన్నాథుడి ఖజానా తలుపులు తెరిచినట్లు ఒడిశా సీఎం కార్యాలయం 'ఎక్స్'లో పోస్టు చేసింది. నలుగురు ఆలయ సేవకులతో పాటు కమిటీ చైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్, శ్రీ జగన్నాథ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (ఎస్‌జేటీఏ) చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అరబింద పాఢీ, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) సూపరింటెండెంట్ డీబీ గడనాయక్, పూరీ రాజు గజపతి మహారాజు ప్రతినిధి సహా మొత్తం 11మంది సభ్యులు గదిలోకి ప్రవేశించారని అధికారులు పేర్కొన్నారు. రత్నభాండాగారం తలుపులు తెరవనున్న నేపథ్యంలో కమిటీ సభ్యులు ఉదయం గుండిచ మందిరంలో జగన్నాథ స్వామికి, ఆయన తోబుట్టువులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనుమతి తీసుకున్నారు. పూరీలో రథయాత్ర సాగుతున్నందున జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి విగ్రహాలు ప్రస్తుతం గుండిచ ఆలయంలో ఉన్నాయి. వచ్చేవారం జరిగే బహుదా యాత్ర సందర్భంగా దేవతామూర్తులను తిరిగి శ్రీక్షేత్రానికి తీసుకొస్తారు. రహస్య గదిలో విషసర్పాలు నిధిని కాపలా కాస్తుంటాయన్న అనుమానాలతో ముందు జాగ్రత్తగా పాములు పట్టడంలో నిపుణులతో పాటు సత్వర చికిత్స కోసం వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఆలయం లోపల, బయట రెండు స్నేక్ క్యాచర్ల బృందాలను సిద్ధంగా ఉంచామని స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యుడు సుభేందు మల్లిక్ తెలిపారు. అంతకుముందు ఎస్‌జేటీఏ చీఫ్ అరబింద పాఢీ మీడియాతో మాట్లాడుతూ ఒడిశా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఖజానాను తెరిచినప్పటికీ విలువైన వస్తువుల లెక్కింపు ప్రక్రియను ఇప్పటికిప్పుడే చేపట్టబోమని చెప్పారు. స్వర్ణకారులు, ఇతర నిపుణుల నియామకం తర్వాతే ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తొలుత రత్నభాండాగారం బయట, లోపలి గదుల్లో ఉన్న ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను చెక్క పెట్టెల్లో భద్రపరిచి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూంకు తరలిస్తామని తెలిపారు. ఖజానా నిర్మాణం భద్రతను నిర్ధారించడం తమ తొలి ప్రాధాన్యంగా చెప్పారు. సంపద ఉన్న పెట్టెలు జీర్ణావస్థకు చేరి ఉంటే ఆభరణాలను తరలించడానికి వీలుగా ఇత్తడి పూత పూసిన ఆరు చెక్క బాక్సులను సిద్ధంగా ఉంచారు. ఖజానా బయట గదిలో ఉన్న ఆభరణాలను ఈ కలప పెట్టెల్లోకి మార్చి సీలు వేసినట్లు తెలిపారు. బహుదా యాత్ర అనంతరం లోపలి గదిలోని బంగారం, వెండి సామగ్రిని కూడా తరలిస్తామని పాఢీ పేర్కొన్నారు. ఆర్‌బీఐ ప్రతినిధి సమక్షంలో ఆభరణాల లెక్కింపు ప్రక్రియ చేపడతామని ఆ తర్వాత వాటి ఫొటోలు, బరువు, నాణ్యత తదితర వివరాలతో డిజిటల్ కేటలాగ్ రూపొందిస్తామని ఒడిశా న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు.



రత్నభాండాగారాన్ని తెరిచే సమయంలో ఆలయం వద్ద భక్తులు

రత్నభాండాగారం వద్ద స్పృహ తప్పిన పూరీ ఎస్పీ?

పూరీ పోలీసు సూపరింటెండెంట్ పినాక్ మిశ్రా శ్రీమందిరంలోని రత్నభాండాగారం తలుపు వద్ద స్పృహ తప్పి పడిపోయారని, ఖజానాలోకి ప్రవేశించిన సభ్యుల్లో ఒకరైన డాక్టర్ సీబీకే మొహంతి ఎస్పీకి చికిత్స అందించారని వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలను ఆలయ భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్పీ మిశ్రా ఖండించారు. ఆలయ సింహద్వారం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు ఎలాంటి అనారోగ్యం లేదని, తాను పూర్తి ఆరోగ్యంగా ఉన్నానని స్పష్టం చేశారు.

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త!

పోలీసు, నిఘా, దర్యాప్తు సంస్థల పేరిట నకిలీ ఈమెయిళ్లు

- వాటికి స్పందించవద్దు
- 1930కి ఫోన్ చేసి తెలియజేయాలి: కేంద్ర హోంశాఖ

న్యూఢిల్లీ, జూలై 14: పోలీసు విభాగాలు, దర్యాప్తు సంస్థల పేరిట సైబర్ మోసగాళ్లు నకిలీ ఈ మెయిళ్లు, నోటీసులు పంపుతున్న ఘటనలు పెరుగుతున్నాయని.. వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని కేంద్ర హోంశాఖకు చెందిన 'ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) ప్రజలకు సూచించింది. ఈ తరహా మెయిళ్లు వచ్చినప్పుడు.. అవి నిజంగానే ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి వచ్చాయా? అని తెలుసుకోవటానికి ఆ వెబ్‌సైట్ చివర gov.in ఉందా అనేది చూడాలని పేర్కొంది. అలాగే, సదరు మెయిల్‌లో ప్రస్తావించిన అధికారుల గురించి సమాచారం, వారి వివరాలను ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి తెలుసుకోవాలని, సంబంధిత ప్రభుత్వ విభాగానికి ఫోన్ చేసి ఈ మెయిల్ గురించి తెలియజేయాలని సూచించింది. ఈ మేరకు ఐ4సీ ఆదివారం ఒక ప్రకటన జారీ చేసింది. అనుమానాస్పద ఈమెయిళ్లు వచ్చినప్పుడు, ఇతరత్రా సైబర్ మోసాలు జరిగినప్పుడు వెంటనే ప్రజలు అప్రమత్తమై www.cybercrime.gov.in కు, లేదా సైబర్ క్రైం హెల్ప్ నంబరు 1930కి సమాచారం అందించాలని తెలిపింది. కాగా, ఈ నెల ఆరంభంలోనూ కేంద్ర ఆర్థికశాఖ ఒక సూచన జారీ చేసింది. ఢిల్లీ పోలీసు సైబర్ క్రైమ్ అండ్ ఎకనామిక్ అఫెన్స్, సెంట్రల్ ఎకనామిక్ ఇంటెలిజెన్స్ బ్యూరో, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఢిల్లీ సైబర్ సెల్ పేర్లతో, ఆయా సంస్థల లోగోలతో, అధికారుల సంతకాలతపంపిస్తున్నారని పేర్కొంది. దీంతో పాటు ఒక అటాచ్‌మెంట్ కూడా పంపుతున్నారని.. చైల్డ్ పోర్నోగ్రఫీ, సైబర్ పోర్నోగ్రఫీ వంటి నేరాలకు పాల్పడ్డావంటూ బెదిరిస్తున్నారని తెలిపింది. ఈ తరహా మెయిళ్లు వచ్చినప్పుడు వాటికి ప్రతిస్పందించవద్దని, వీటి గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించింది. ఢిల్లీలోని సెంట్రల్ సెక్రటేరియట్‌లో పని చేసే ఉద్యోగులకు కూడా గత వారం అనుమానాస్పద ఈమెయిళ్లు వచ్చాయి.


నిజాంపట్నం హార్బర్‌లో జెట్టీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, మత్స్యశాఖాధికారులు

ఆక్వాపార్కుకు 192 ఎకరాల స్థలాన్ని సేకరిస్తున్నాం

- నిజాంపట్నం హార్బర్ అభివృద్ధి పనులు, మడ అడవుల పరిశీలన
- కలెక్టర్ వెంకటమురళి

రేపల్లె, జూలై 14: తీరప్రాంతంలో ఆక్వాసాగుకు అన్ని వసతులతో కూడిన 192 ఎకరాల్లో ఆక్వాపార్కు అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని బాపట్ల జిల్లా కలెక్టర్ జే వెంకటమురళి అన్నారు. ఆదివారం సూర్యలంక ఆదర్శనగర్ బ్రిడ్జి వద్దనుంచి నిజాంపట్నం హార్బర్ వరకు బకింగ్‌హాం కెనాల్‌లో 14 కిలోమీటర్ల మేర బోటులో కలెక్టర్ వెంకటమురళి, మత్స్యశాఖాధికారులు పర్యటించారు. నిజాంపట్నం హార్బర్‌లో జెట్టీలను, సముద్రం ఒడ్డున మడ అడవులను, హార్బర్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపట్నంలో పర్యాటక, ఆక్వారంగాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్వాపార్కుకు భూమిని ప్రభుత్వం కేటాయిస్తే పనులు మొదలుపెడతామని తెలిపారు. నిజాంపట్నం హార్బర్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, 2.5 హెక్టార్ల అటవీభూమిని భూసేకరణ చెయ్యాల్సి ఉందన్నారు.

బాపట్ల జిల్లాలో బీచ్‌ల వద్ద మరణాలు పూర్తిగా అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అన్నారు. ఇప్పటికే సముద్రతీరప్రాంతాల్లో పర్యటించి అక్కడ పరిస్థితులను అధ్యయనం చేస్తున్నామన్నారు. ప్రకృతి విపత్తుల్లో తీర ప్రాంతానికి కంచుకోటగా మడ అడవులు నిలుస్తున్నాయన్నారు. కావున వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మడ అడవులను నరికివేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. హార్బర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు. జెట్టీల నిర్మాణం పెంపు కొరకు సముద్రంలో బోట్లు రాకపోకలు సాగించేలా మొగ వద్ద పేరుకుపోయిన ఇసుకను డ్రెడ్జర్ల ద్వారా పూర్తిగా తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో బాపట్లజిల్లా మత్స్యశాఖాధికారి పి.సురేష్, బాపట్ల ఆర్డీవో ఆర్.రవీంద్ర, నిజాంపట్నం బోటు ఓనర్స్ అసోసియేషన్ నాయకులు బొమ్మిడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జూలై 14: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారు దలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 264 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వ కు 123, పశ్చిమ కాల్వకు 83, నిజాంపట్నం కాల్వకు 187, కొమ్మమూరు కాల్వకు 1005 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నేడు, రేపు ప్రజాదర్బార్ రద్దు

తాడేపల్లి, జూలై 14: వర్షాభావ పరిస్థితుల కారణంగా సోమ, మంగళవారాల్లో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని రద్దు చేశారు. మళ్లీ ప్రజాదర్బార్ జరిగే తేదీని త్వరలో తెలియపరుస్తామని నారా లోకేశ్ కార్యాలయ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు.

తెగని పంచాయితీ

- కొనసాగుతున్న గందరగోళం
- పలువురికి ఈ నెలలో ఆగిన వేతనాలు
- కార్యదర్శులకు దక్కని డీడీవో అధికారాలు
- తలనొప్పిగా క్లస్టర్ పంచాయతీల వ్యవహారం

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గత రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ తాలూకా గందరగోళం ఇప్పట్లో తొలగేలా లేదు. గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలు, పంచాయతీ బాధ్యతలు అప్పగించినా గత ప్రభుత్వ నిర్వాకంతో అవి వారికి ఎండమావిగానే మారిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీ, వార్డు కార్యదర్శుల పేరిట వందల మందిని ఎంపిక చేసి నిర్దిష్టమైన జాబ్ చార్టు ఇవ్వకుండా చాకిరీ చేయించుకుంది. దీంతో వారంతా తమకు పంచాయతీ విధులు కేటాయించాలని ఆందోళన చేపట్టడంతో గడిచిన రెండేళ్లలో మూడు సార్లు జీవోలు జారీ చేసింది. కానీ అమలు చేయలేదు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న 'ఒక పంచాయతీ.. ఒక కార్యదర్శి' విధానాన్ని, అందుకోసం తీసుకువచ్చిన జీవో 11ను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. కాగా కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోలను తాజాగా అమలు చేసింది. గ్రేడ్- 5 కార్యదర్శులందరికీ గ్రామ పంచాయతీలను కేటాయించింది. కానీ గత ప్రభుత్వం సృష్టించిన గందరగోళం కారణంగా వారిలో చాలా మందికి ఆ హోదా ఈరోజు వరకూ దక్కలేదు.

వెంటాడుతున్న క్యాడర్ స్ట్రెంగ్త్ సమస్య

కూటమి ప్రభుత్వం మూడు జిల్లాల్లో 500మంది గ్రేడ్-5 కార్యదర్శులకు గ్రామ పంచాయతీలు కేటాయించి, డీడీవో హోదా కల్పించింది. కానీ వారిలో చాలా మందికి క్యాడర్ స్ట్రెంగ్త్ సమస్య కారణంగా ఆ హోదా దక్కలేదు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన క్లస్టర్ విధానమే అందుకు కారణంగా తెలుస్తోంది. క్లస్టర్ విధానం కారణంగా 3, 4 మైనర్ పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, అందులో ప్రధాన పంచాయతీ కార్యదర్శిని ఎంపీడీవో లాగిన్లలోకి మ్యాప్ చేశారు. ఆ కారణంగా ఒక మండలంలో 15 పంచాయతీలు ఉంటే, 7, 8 మంది మాత్రమే మ్యాప్ అయ్యారు. మిగిలినవారు ఎంపీడీవో క్యాడర్ పరిధిలోకి రాకుండా పోయారు. ఎంపీడీవో లాగిన్లో మ్యాప్ అయిన కార్యదర్శుల బిల్లులకు మాత్రమే ట్రెజరీ ఆమోదం లభిస్తుంది. ఆ కారణంగా క్లస్టర్ పంచాయతీల్లోని అనేక మంది పంచాయతీ కార్యదర్శులకు ట్రెజరీ శాఖ బిల్లులను ఆపేసింది. దీంతో వారికి ఈ నెల జీతాలు దక్కలేదు. కాగా కొన్ని జిల్లాలో 2, 3 నెలల నుంచి కూడా జీతాలు అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. దీంతో వారంతా పంచాయతీరాజ్ కమిషనర్‌కు గోడు విన్నవించుకున్నారు. ఆయన తక్షణమే స్పందించి ట్రెజరీ శాఖ డైరెక్టర్‌కు లేఖ పంపారు.

> **సమస్యను పరిష్కరించండి**
> గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శుల క్యాడర్ స్ట్రెంగ్త్ సమస్యను వెంటనే పరిష్కరించాలి. డీడీవో అధికారాలు అందరికీ వర్తింపజేయాలి. క్లస్టర్ పంచాయతీ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి 'ఒక పంచాయతీ- ఒక కార్యదర్శి' జీవోను అమలు చేయాలి.
> **- ముదువర్తి రమేశ్‌బాబు, కార్యదర్శుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**

క్లస్టర్ గందరగోళం

గతంలో కార్యదర్శుల కొరత కారణంగా ప్రభుత్వం మూడు, నాలుగు పంచాయతీలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసింది. వాస్తవానికి గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఉన్న 1200 పంచాయతీలకు 1236 మంది కార్యదర్శులు ఉన్నారు. కార్యదర్శుల కొరత లేని కారణంగా క్లస్టర్ వ్యవస్థని పూర్తిగా రద్దు చేయవచ్చు. క్లస్టర్ ప్రధాన కేంద్రంగా ఉన్న పంచాయతీలను కూడా గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 5లకు కేటాయించవచ్చు. ఆ దిశగా కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్యదర్శులు కోరుతున్నారు. గ్రేడ్ -2, 3, 4, 5 పంచాయతీల్లోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులకు మెరిట్ ప్రాతిపదికన పంచాయతీలు కేటాయించి 'ఒక పంచాయతీకి- ఒక కార్యదర్శి' జీవో 11 పూర్తిస్థాయిలో అమలు చేయాలని కార్యదర్శులు కోరుతున్నారు.

వైభవంగా శ్రీమహంకాళీ అమ్మవారి బోనాల జాతర


మహంకాళీ అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి ఎస్.సవిత


బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న మహిళా భక్తులు

దుగ్గిరాల, జూలై 14: మండలంలో ప్రసిద్ధిచెందిన కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయంలో తెలుగు మహిళావిభాగం ఆధ్వర్యంలో బోనాల జాతర ఆదివారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయానికి వచ్చిన సుమారు 200 మంది మహిళాభక్తులు అమ్మవారికి పొంగలి నైవేద్యం సిద్ధం చేశారు. మంగళగిరి రూరల్ మండలం టీడీపీ మహిళాధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, మాలెంపాటి వెంకటేశ్వరరావుల సౌజన్యంతో బాలికలతో కలిసి తెలుగు మహిళానేతలు, కార్యకర్తలు ఉత్సాహం గా కోలాటం ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం బోనాలతో ఊరేగింపుగా బయలుదేరిన మహిళలు మేళతాళాల మధ్య ఆల యం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని బో నాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వైభవంగా జరిగిన బోనాల జాతర భక్తులకు కనువిందుచేసింది. టీడీపీ రాష్ట్ర అధికా ర ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, మంగళగిరి రూరల్ అధ్యక్షురాలు గడ్డిపాటి అపర్ణ, దుగ్గిరాల మండల టీడీపీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మి, మంచికలపూడి వైష్ణవి, ఆకుల జయసత్య, ఆరుద్ర భూలక్ష్మి, ఎంపీటీసీలు పసుపులేటి సాయిచైతన్య, చిలువూరు మరియరోజమ్మ, తోటకూర సీతారామయ్య, పోలిమెట్ల రత్నగిరిరావు, డాక్టర్ రంగిశెట్టి రమేష్‌బాబు, గద్దె శ్రీనివాస్, ఆలపాటి శ్రీనివాసరావు, ఆలపాటి రామారావు, జానకీదేవి, నాయుడు సీతయ్య, చిలువూరు శేషగిరి, పినపాటి కరుణాకర్, పేరూరి సత్యనారాయణ, ఇందుపల్లి బాల, మద్దుకూరు శ్రీను పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీమహాకాళీ అమ్మవారి సన్నిధిలో మంత్రి సవిత

శ్రీమహంకాళీ అమ్మవారిని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖామంత్రి ఎస్.సవిత ఆదివారం దర్శించుకున్నారు. ఆషాఢ మాసం రెండో ఆదివారం అమ్మవారు లక్షగాజుల అలంకరణతో భక్తులకు కనువిందు చేశారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన మంత్రి సవితకు అర్చకులు, దేవదాయశాఖ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్న మంత్రికి ఆలయ ఈఓ డీసీహెచ్ వెంకటరెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్‌లు అమ్మవారి చిత్రపటంతో పాటు ఆషాఢసారెను బహూకరించారు. అర్చకులు తారక్‌నాథ్ శర్మ, సుబ్రహ్మణ్యశర్మ, మణిశర్మలు శుభాశీ ర్వచనం అందించారు.

47.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


ప్రత్తిపాడులోని పౌల్ట్రీఫారంలో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకొన్న రేషన్ బియ్యం

గుంటూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని పౌల్ట్రీ ఫారాలకు కూడా తరలిస్తున్నారు. పేద ప్రజలు వండుకొని తినాల్సిన బియ్యాన్ని కోళ్లకు దాణాగా పెడుతున్నారు. జొన్నలు, సజ్జలు ఇతర ధాన్యాలతో పోల్చితే రేషన్ బియ్యం తక్కువ ధరకు లభిస్తుండటంతో పౌల్ట్రీఫారం యజమానులు కూడా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కే ఈశ్వరరావుకు ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామంలోని బాలాజీ పౌల్ట్రీ ఫారం నిర్వాహకులు రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొని, నిల్వచేసి, పౌల్ట్రీ ఫీడ్‌గా వాడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. ఆ మేరకు ఆయన విజిలెన్స్ అధికారులు, సిబ్బందిని పంపించి బాలాజీ పౌల్ట్రీ ఫారంను మండల రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీ చేయించారు. ఈ సందర్భంగా అక్కడ 92 బియ్యం బస్తాలపై ఏపీ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అని ముద్రలు ఉన్నాయి. ఒక్కో బస్తా 50 కేజీల చొప్పున 46.00 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం గుర్తించారు. ఇవి కాక 5 తెల్ల సంచులలో 1.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉండటాన్ని గమనించారు. పౌల్ట్రీ ఫారంలో మొత్తం 47.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు తేలింది. విచారణలో పౌల్ట్రీ ఫారం లీజుదారైన నాగవరపు సురేష్ పౌల్ట్రీ ఫీడ్ ఖర్చు తగ్గించుకొనుటకు, పరిసర గ్రామాలలో రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి, పౌల్ట్రీ ఫీడ్‌గా వినియోగిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 47.50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనపరచుకొని, యజమాని నాగవరపు సురేష్‌పై 6ఏ, క్రిమినల్ కేసు నమోదు చేయవలసినదిగా స్థానిక రెవెన్యూ అధికారిని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదేశించారు. తనిఖీలలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఐ శ్రీనివాసులురెడ్డి, స్థానిక రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బరితెగించిన మాజీ ఎంపీ సురేష్ అనుచరులు

తుళ్లూరు, జూలై 14: రాజధాని ప్రాంతంలో బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరులు, బంధువుల ఆగడాలు ఆగటం లేదు. మోదులింగాయపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తి ఉద్దండ్రాయునిపాలెం లంకలోకి ఆదివారం కూలీలకు భోజనం తీసు కుని వెళుతున్నాడు. ఈ క్రమంలో ఎంపీ అనుచరులు కరకట్ట మార్గంలో బైకులు అడ్డంగా పెట్టారు. బురదగా ఉంది దారి వదలమని శ్రీనివాసరావు వారిని కోరాడు. దాంతో రెచ్చిపోయిన ఎంపీ అనుచరులు శ్రీనివాసరావును చితక బాదారు. ఈ ఘటనపై బాధితుడు శ్రీనివాసరావు ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేసినట్లు తుళ్ళూరు సీఐ-2 అనురాధ తెలిపారు.

అభివృద్ధి కారకులనే టీడీపీ ప్రోత్సహిస్తుంది

- ప్రగతిపథంలో పయనిస్తున్న రాష్ట్రం
- టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్

గుంటూరు, జూలై 14: తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధి కారకులను ప్రోత్సహిస్తుందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్ అన్నారు. ఆదివారం ఆయన గుంటూరులో విలేకరులతో మాట్లాడుతూ తాము చేసిన కార్యక్రమాలన్నింటిని గత వైసీపీ ప్రభుత్వం అడ్డుకుందన్నారు. ఇకపై అభివృద్ధికి ఎలాంటి అవరోధాలు ఉండవన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బాబు మానసపుత్రిక అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని టీడీపీ ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయటానికి సన్నాహాలు చేస్తుందన్నారు. పేదవాడికి పట్టెడు అన్నం పెట్టే అన్న క్యాంటీన్‌లను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. త్వరలో అన్న క్యాంటీన్‌లను పునరుద్ధరించి టీడీపీ ప్రభుత్వం పేదల పక్షపాతి అని మరోసారి నిరూపిస్తుందన్నారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్టీఆర్ భరోసా పేరుతో పెంచిన పెన్షన్ మొత్తాన్ని మొదటి నెలలోనే అవ్వాతాతలకు, వితంతువులకు, వికలాంగులకు అందజేసిందన్నారు. ఉచిత ఇసుక విధానానికి శ్రీకారం చుట్టి, ఇది చేతల ప్రభుత్వం అని నిరూపించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్‌రెడ్డి వ్యవస్థలను భ్రష్టు పట్టించారన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ఒక పక్క వ్యవస్థలను గాడిలో పెటుడుతూ మరో పక్క రాష్ట్ర అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాజధాని లేని రాష్ట్రంగా చిన్నాభిన్నం చేశారన్నారు. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబుపై నమ్మకంతో పెట్టుబడులు వస్తున్నాయన్నారు. అమరావతి రాజధానికి పూర్వ వైభవం వచ్చిందన్నారు. నిరుద్యోగ యువతకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి యువతకు భరోసా కలిపించింది. ఎస్సీ , ఎస్టీ, బీసీల కార్పొరేషన్‌లతో పాటు సబ్ ప్లాన్ నిధులను వైసీపీ దారి మళ్లించి వారి అభివృద్ధిని నిర్వీర్యం చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం పంచాయితీల నిధులను దారి మళ్లించి సర్పంచ్ లను డమ్మీగా చేసిన ఘనత జగన్ రెడ్డికే దక్కిందన్నారు.

15, 16న ఫిరంగిపురంలో కార్మెల్ మాత మహోత్సవాలు


పూజలు అందుకోనున్న కార్మెల్ మాత

ఫిరంగిపురం, జూలై 14: ఫిరంగిపురంలోని కార్మెల్ కొండపై ఈనెల 15, 16 తేదీల్లో కార్మెల్‌మాత ఉత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ప్రతి ఏడాది ప్రతిష్ఠాత్మకంగా జరిగే ఈ ఉత్సవాలలో లక్షలాది మంది భక్తులు పాల్గొని తరిస్తుంటారు. గ్రామంలోని కార్మెల్ కొండపై 1981లో లండన్ మిల్‌హిల్‌కు చెందిన ఫాదర్ థియేటర్ డిక్మన్ దేవాలయాన్ని నిర్మింపచేశారు. అప్పటినుంచి ఆర్‌సీఎం క్రైస్తవ భక్తులతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి గురువులు, కన్యా స్త్రీలు, భక్తులు వచ్చి మొక్కు తీర్చుకుంటుంటారు. పండుగలో ఉచితంగా తాగునీరు, భోజన వసతి, ఉండేందుకు సత్రశాలలు ఏర్పాటు చేసినట్టు చర్చి ఫాదర్ పాతిమా మర్రెడ్డి తెలిపారు. 15వ తేదీ ఉదయం కొండమీద పూజ, సాయంత్రం 5గంటలకు దివ్య సత్ప్రసాదం, మరియమాత స్వరూపాలతో భారీ ఊరేగింపు, అనంతరం గుంటూరు బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య సందేశం ఉంటుందన్నారు. అదేవిధంగా 16వ తేదీ కార్మెల్ కొండపై సమష్టి దివ్య పూజాబలి ఉంటాయని ఆయన తెలిపారు.

జనసేన కార్యకర్తకు కత్తిపోట్లు


కత్తిపోటు గాయంతో వైద్యశాలకు వస్తున్న ఫయాజ్‌బాషా

తెనాలి రూరల్, జూలై 14 : జనసేన పార్టీ కోసం పని చేశాడని కక్ష పెంచుకుని అతనిని వైసీపీ అరాచక మూకలు కత్తితో పొడిచారు. బాధితుడు, స్థానికులు, కటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తేలప్రోలు గ్రామానికి చెందిన షేక్ ఫయాజ్‌బాషా (28) వెండి ఆభరణాలు తయారు చేసే పనిచేస్తుంటాడు. ఇటీవల ఎన్నికల్లో ఫయాజ్‌బాషా జనసేన పార్టీకి మద్దతు తెలిపి గ్రామంలో పార్టీని బలోపేతం చేస్తూ కూటమి విజయానికి పనిచేశారు. అంతే కాకుండా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామంలో జనసేన పార్టీ దిమ్మెను సైతం ఏర్పాటు చేశాడు. ఆ సమయంలో గ్రామ సెక్రటరీతో దిమ్మెకట్టవద్దని గ్రామ ప్రెసిడెంట్ బాషాకు అడ్డు తగిలే ప్రయత్నం చేయగా అది ఫలించలేదు. దీంతో కక్షపెట్టుకున్న వైసీపీ నాయకులు ఆదివారం ఫయాజ్ బాషా తన అమ్మమ్మ ఇంటికి వెళుతున్న క్రమంలో గ్రామ ప్రెసిడెంట్ వైసీపీ నాయకుడు బాషా, సుభాని, రబ్బాని కలిసి కత్తితో పొడిచారు. దీంతో రక్తగాయాలతో ఉన్న ఫయాజ్‌బాషాను గ్రామస్తులు హుటాహుటిన తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

వేగం పుంజుకున్న గూడూరు-విజయవాడ మూడో రైల్వేలైన్ పనులు

తెనాలి క్రైం, జూలై 14: విజయవాడ-గూడూరు రైల్వేస్టేషన్ల మధ్య మూడో లైను నిర్మాణం, విద్యుదీకరణ పనులు వేగం పుంజుకున్నాయి. మరో ఏడెనిమిది నెలల్లో ఈ మార్గంలో మూడో లైను అందుబాటులోకి రానున్నదని అధికారులు వెల్లడించారు. గూడూరు-బిట్రగుంట, బిట్రగుంట-కరువది, కరువది-కృష్ణాకెనాల్ మధ్య మూడు దశల్లో నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటికే గూడూరు నుండి చుండూరు రైల్వేస్టేషన్ వరకు మూడో లైను నిర్మాణం, విద్యుదీకరణలు పూర్తి అయ్యాయి. కరువది నుండి బాపట్ల వరకు మూడో లైనుపై రైళ్ళ రాకపోకలు కొనసాగుతున్నాయి. కరువది-విజయవాడ మధ్య రూ.1046కోట్లతో పనులు సాగుతున్నాయని 2025 మార్చి నాటికి ఈ పనులు పూర్తిచేసి మూడో లైను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మార్గంలోని మోదుకూరు, స్టూవర్టుపురం, కడవకుదురు, కొత్తపందిళ్ళపల్లి, ఈపూరుపాలెం, జాండ్రపేట, కొలకలూరు, కొలనుకొండ వంటి ఎనిమిది చిన్న స్టేషన్లలో ఫుట్‌బ్రిడ్జిలు, ప్లాట్‌ఫారాల నిర్మాణాలు పూర్తయ్యాయి. స్టేషన్లు కూడా ఆధునీకరించడం, ప్రయాణికులకు తాగునీరు, తగిన సీటింగ్ వసతి, టాయిలెట్స్ వంటి సదుపాయాలతో పాటు ఆయా స్టేషన్లలో అధునాతన సిగ్నల్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇందులో భాగంగానే ఈనెల 16నుండి 30వ తేదీ వరకు నాన్ ఇంటర్ లాకింగ్ పనులు కొనసాగనున్నాయని, దీంతో ఈ మార్గంలో నడిచే కొన్ని ట్రైన్స్ పూర్తిగా రద్దు చేయడం, మరికొన్ని దారిమళ్లించడం, కొన్ని ట్రైన్స్ రీషెడ్యూల్ చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో గూడూరు-విజయవాడ రైలుమార్గం ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా మారనున్నదన్నారు. మూడో లైను నిర్మాణం పూర్తి కాగానే నాలుగో లైను నిర్మాణానికి కూడా రైల్వే అధికారులు సమాయత్తమవుతున్నట్లు తెలుస్తున్నది. దీనికి సంబంధించి ప్రాథమిక అంచనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.



చుండూరు-పొన్నూరు స్టేషన్ల మధ్య జరుగుతున్న విద్యుదీకరణ పనులు, చుండూరు రైల్వే స్టేషన్ వద్ద జరుగుతున్న ట్రాక్ పనులు

పెదకాకాని మల్లేశ్వరుని సన్నిధిలో రాజధాని రైతులు

- పాదయాత్రగా వచ్చిన రాజధాని మహిళలు, రైతులు
- స్వాగతం పలికిన పెదకాకాని మండల టీడీపీ నాయకులు


పాదయాత్రగా వచ్చిన రాజధాని రైతులకు, మహిళలకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

పెదకాకాని, జూలై 14: రాజధాని మహిళా రైతులు అమరావతి ఒక్కటే రాజధానిగా ఉండాలని కోరుతూ 1600 రోజులుగా దీక్షలు చేపట్టారు. వారి దీక్షలు ఫలించి ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అధికారంలోకి వచ్చి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయి అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఉంటుందని, రాజధాని ప్రాంతంలో అభివృద్ధి చేస్తున్నారు. ఈ సందర్భంగా రాజధాని మహిళలు పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి మొక్కుబడి కోసం ఆదివారం పాదయాత్రగా బయలుదేరి పెదకాకాని సెంటర్‌కు చేరుకున్నారు. వారికి పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళా రైతులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజధాని రైతులు చేసిన త్యాగాలు చూసిన ఆంధ్రప్రదేశ్ ఓటర్లు రాష్ట్రంలో కూటమి అధికారంలోకితెచ్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, పొన్నూరు నియోజకవర్గం తెలుగుయువత అధ్యక్షుడు మేడ వెంకటకృష్ణ, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి ఆత్మకూరి వెంకటేశ్వర్లు, పెంద్యాల నాగేశ్వరావు, యడ్లవల్లి మధు, షేక్ మజాహర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తెనాలి క్రైం, జూలై 14: ట్రైన్ నుండి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన దుగ్గిరాల రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. తెనాలి రైల్వే పోలీసుల కథనం మేరకు.. తెనాలి-విజయవాడ ప్రధాన రైలుమార్గంలో దుగ్గిరాల రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం 60-65సంవత్సరాల వయసుగల గుర్తుతెలియని వ్యక్తి ట్రైను నుంచి జారిపడి మృతి చెందాడు. మృతుడిపై తెల్లషర్టు ఉంది. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెదకాకాని, జూలై 14: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఆదివారం పెదకాకాని పోలీసులు తెలిపారు. తక్కెళ్ళపాడు అడ్డరోడ్ సమీపంలో రోడ్డుపై వెళ్తున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా, వాహనదారుడికి తీవ్రగాయాలు అయ్యాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119, 127, 137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



పోస్టర్ ఆవిష్కరించి ఉచిత శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న గొలపల శ్రీనివాసరావు

ఉచిత శిక్షణ ఏర్పాటు చేయటం అభినందనీయం

● టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు

బాపట్లజూలై 14 : నిరుద్యోగయువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఉచిత శిక్షణా తరగతులు ఏర్పాటు చేయటం అభినందనీయమని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు అన్నారు. శ్రీభావపురి విద్యాసంస్థలలో టెట్ అభ్యర్థులకు సైకాలజి, విద్యాదృక్పథాలపై డాక్టర్ కొమ్మూరి నరసింహారావుచే ప్రిన్సిపాల్ ఆవుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభించారు. కార్యక్రమానికి గొలపల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని పోస్టర్ ఆవిష్కరించి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీపై తొలిసంతకం చేశారన్నారు. దీనికి శిక్షణ పొందటానికి యువతకు ఉచిత శిక్షణ ఏర్పాటు చేయటం సంతోషదాయకమని, దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దిబోయన అమృత్, పివి అంజనేయులు, నారాయణ, డాక్టర్ సుబ్బారావు, మకరతవల్లి తదితరులు పాల్గొన్నారు.

శ్రీబగళాముఖి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, జూలై 14 : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శ్రీ బగళాముఖి అమ్మవారికి ఆదివారం సందర్భంగా మండలం, వివిధ ప్రాంతాలు నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకులు కె.శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీబగళాముఖి అమ్మవారు

శాకాంబరి అలంకరణలో శ్రీవాసవి అమ్మవారు

కర్లపాలెం, జూలై 14 : కర్లపాలెంలోని శ్రీవాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆషాడమాసం సందర్భంగా శ్రీ వాసవి అమ్మవారికి ఆదివారం శాకాంబరి అలంకరణ చేసి ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి సారె సమర్పించి హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో తూనుగంట్ల జగన్, లలితబాబు, గుప్తా, సోమశేఖర్, అచ్యుతభద్రయ్య, పొలూరి రామకృష్ణారావు, శ్వేత, అనిత, అనూష, వసుంధర, సువర్చల, రాజేశ్వరి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



శాఖాంబరి అమ్మవారికి హారతులిస్తున్న మహిళలు

కర్లపాలెంలో టెన్నిస్ క్రికెట్ టోర్నమెంట్

కర్లపాలెం, జూలై 14 : కర్లపాలెంలోని 216 జాతీయ రహదారి పెట్రోల్ బంకు పక్కన ఈనెల 7న ప్రారంభమైన బాపట్ల నియోజకవర్గ స్థాయి టెన్నీస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం రెండో రౌండ్‌లో బాపట్ల, కంకటపాలెం వర్సెస్ కర్లపాలెం పెట్రోల్ బంకు సర్కిల్ టీమ్‌లు పోటీపడగా కర్లపాలెం పెట్రోల్ బంకు సర్కిల్ విజయం సాధించింది. సోమవారం నుంచి మూడో రౌండ్ ప్రారంభమౌతుందని 7 రోజులలో ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

గౌరవ డాక్టరేట్ అందుకున్న మోర్లకు ఘనసన్మానం

పిట్టలవానిపాలెం, జూలై 14 : పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావుకు ఇటీవల హైదరాబాద్‌లో అంతర్జాతీయ మనం ఫౌండేషన్ వారి సౌజన్యంతో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం శాఖా గ్రంథాలయ ఛైర్మన్ ఎం.చిన సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శ్రీనివాసరావుకు శాఖా గ్రంథాలయంలో పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. సత్కరించిన వారిలో పిట్టలవానిపాలెం మాజీ సర్పంచ్ వేగేశన జ్యోతిరామకృష్ణంరాజు, అల్లూరి శివరామరాజు, బేతాళం సుబ్బరాజు, రుద్రరాజు రవివర్మరాజు, అక్కల సుబ్బారెడ్డి, డేగల రవిరెడ్డి, పిట్టు బ్రహ్మారెడ్డి, వాలి లక్ష్మణస్వామిరెడ్డి, వై.చినరాఘవ, పాఠకులు, పలువురు గ్రామపెద్దలు ఉన్నారు.



మోర్ల శ్రీనివాసరావును ఘనంగా సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ వేగేశన జ్యోతిరామకృష్ణంరాజు, పలువురు గ్రామపెద్దలు తదితరులు

అధ్వానంగా నాగేంద్రపురం రోడ్డు

బాపట్లరూరల్, జూలై 14 : బాపట్ల మండలం జీబీసీ రోడ్డు నుంచి నాగేంద్రపురం గ్రామానికి వెళ్ళేందుకు ఉన్న రోడ్డు గుంతలుమయంగా, అధ్వానంగా మారిపోయింది. గత పాలకుల నిర్లక్ష్యానికి బాపట్ల మండలంలోని ప్రధాన రహదారికి అనుసంధాన రోడ్లు గుంతలు మయంగా, రూపురేఖలు కోల్పోయి వర్షాలకు రోడ్లు కోసుకుపోయి తారు, చిప్స్ కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. గ్రామాలలో ఉన్న రహదార్లు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. ఈ మార్గంలో ప్రయాణం తీవ్ర అసౌకర్యంగా మారిందని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. నాగేంద్రపురం రోడ్డు ద్వారా సుమారు 5 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రిపూట పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. ఏళ్ళ తరబడి రహదార్లు అధ్వానంగా మారినా, గత పాలకులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని ప్రజలు తెలిపారు. అనుసంధాన రహదార్లకు వెంటనే మరమ్మతులు చేసి యదాస్థితికి తీసుకురావాలని, అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన నాగేంద్రపురం రహదారి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నగరం, జూలై 14 : విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నగరం మండలంలోని లుక్కావారిపాలెం, పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్‌శాఖాధికారులు తెలిపారు. విద్యుత్ లైన్లు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్న సందర్భంగా ఈ అంతరాయం ఏర్పడుతున్నదని తెలిపారు. వినియోగదారులు విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

డ్రైనేజీలు ఇలా... మురుగుపోయేది ఎలా?

● అధ్వానపు డ్రెయిన్‌లతో అల్లాడుతున్న పట్టణ ప్రజలు

● క్షీణిస్తున్న పారిశుధ్యం ● వ్యాపిస్తున్న వ్యాధులు

బాపట్ల, జూలై 14 : బాపట్ల జిల్లా కేంద్రంలో డ్రైనేజి సమస్య పట్టిపీడిస్తున్నది. ఉన్న డ్రైనేజీలలో తుంగపెరిగి, వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ముందుకెళ్ళే పరిస్థితి కనిపించటం లేదు. దీనివల్ల ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతున్నది. కొన్నిచోట్ల డ్రైనేజీలను పూడ్చివేశారు. మరికొన్నిచోట్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా దుర్గంధ పూరితమైన డ్రైనేజీలలో పందులు స్వైరవిహారం చేయటం పరిపాటిగా మారింది. దీనివల్ల ఎక్కడ అంటువ్యాధులు వ్యాపిస్తాయోనని పట్టణ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలం ప్రారంభమై వర్షపుజల్లులు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులతో ఇప్పటికే అనేకమంది ఇబ్బంది పడుతున్నారు. జ్వరాలు, వాంతులు, విరోచనాలు వంటివి వ్యాపిస్తున్నాయి. డ్రైనేజి పక్కన నడవాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. పరిసరప్రాంతాలలో నివసించే కుటుంబాలవారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. పట్టణంలోని ప్రధాన డ్రెయిన్ తవ్వకాల్వలో విపరీతంగా గడ్డి, తుంగ పెరిగిపోయింది. దీనికితోడు ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుగా నిలిచి మురుగు ముందుకెళ్ళకుండా చేస్తున్నాయి. మీడియం, మైనర్ డ్రెయిన్‌ల నుంచి వచ్చే మురుగు మేజర్ డ్రెయిన్ గుండా ప్రవహించకపోవటం వల్ల అనేక చోట్ల మురుగు నిలిచిపోయి పైకి ఉబికి రోడ్లమీదకొస్తున్నది. సూర్యలంకరోడ్డులోని పాత కోర్టు భవనం దగ్గర, వ్యవసాయ కళాశాల ఎదురు, పక్కన ఉన్న డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. ఇక మురికివాడల పరిస్థితి చూస్తే ఉన్న డ్రైనేజీలు పూడ్చేశారు. కొత్త డ్రెయిన్‌లు నిర్మించలేదు. ఫలితంగా వర్షం వస్తే రోడ్లన్నీ కాల్వలుగా మారుతున్నాయి. కూరగాయల మార్కెట్ దగ్గర ఎల్ఐసి కార్యాలయంకు వెళ్ళే ప్రధాన రోడ్డుపై నిత్యం డ్రైనేజీలో మురుగుపైకి వచ్చి దుర్గంధ పూరితంగా మారుతున్నది. దీనికితోడు మార్కెట్‌లోని వ్యర్థాలు, చికెన్ స్టాల్స్‌లోని వ్యర్థాలు మురుగులో కలిసి దుర్వాసన వస్తున్నది. మున్సిపల్ కార్యాలయంలో చాలిచాలని శానిటరీ సిబ్బందితో అన్ని పనులు చేయించటం శానిటరి ఇన్‌స్పెక్టర్‌కు కష్టంగా మారింది. రెండు పోస్ట్‌లకు గాను ఇక్కడ ఒక ఇన్‌స్పెక్టర్ మాత్రమే పని చేస్తున్నారు. అన్ని వార్డులు తిరిగి పారిశుధ్య పనులు నిర్వహించలేకపోతున్నారు. దీనివల్ల పట్టణ ప్రజలు పారిశుధ్యం లోపించి ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు తగినంత మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసి డ్రైనేజీలు ఆధునీకరించి మురుగు ముందుకెళ్ళే విధంగా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా అవసరమైన చోట్ల నూతన డ్రైనేజీలు నిర్మించటంతోపాటు పూడ్చి ఆక్రమించిన డ్రైనేజీలను తిరిగి పని చేసే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బాపట్ల వ్యవసాయ కళాశాల గేటు దగ్గర డ్రైనేజి సరిగ్గా లేక దుర్గంధం వెదజల్లుతున్న మురుగు

వర్షం వస్తే రోడ్లపైనే నీరు

డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా లేక వర్షం వస్తే రోడ్లపైన నిలిచిన నీరు డ్రైనేజిలోకి వెళ్ళే పరిస్థితి కనిపించటం లేదు. బాపట్ల కొత్తబస్టాండ్ కూడలిలో కర్లపాలెం రోడ్డులో వర్షంనీరు రోడ్డుపై నిలిచి పక్కనే ఉన్న డ్రైనేజిలోకి వెళ్ళటంలేదు. దీనికితోడు డ్రైనేజీలో నీరు కూడా వర్షపు నీటితో కలిసి దుర్గంధం వెదజల్లుతున్నది. అయినప్పటికి సంబంధితాధికారులు తగిన చర్యలు తీసుకోవటంలేదు. దీనిపై స్పందించి రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బాపట్ల కాకతీయ సేవాసమితి నూతన కమిటీ ఎన్నిక

బాపట్ల రూరల్, జూలై 14 : బాపట్ల కాకతీయ సేవాసమితి నూతన కమిటీ సభ్యుల ఎన్నికను ఆదివారం కమ్మ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవాసమాఖ్య ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతన కమిటీ కన్వీనర్‌గా అప్పికట్లకు చెందిన అచంట అమరేష్, సభ్యులుగా బొందలపాటి వెంకట్రావు, పువ్వాడ దుర్గాప్రసాద్, కారుమంచి నాగార్జున, అప్పసాని మహేంద్రనాథ్‌చౌదరి, వంకాయలపాటి హరిబాబు, కందేపు శ్రీకాంత్, కూచిపూడి రాము, న్యాయ సలహాదారులు నల్లమోతు సుబ్బారావు, పంగులూరి షణ్ముఖ, కాకా రమేష్, ఎన్.గణేష్, మద్ది ప్రసన్నాంజనేయులను ఎన్నుకోవటం జరిగిందని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సేవాసమితి ద్వారా పేద ప్రజలకు విద్య వైద్య అందించటం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా కమ్మజనసేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం కార్యక్రమాలను నిర్వహించటం జరిగిందని భవిష్యత్తులో మరెన్నో కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ముప్పలనేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు తదితరులు

రేపు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం

పిట్టలవానిపాలెం, జూలై 14 : పిట్టలవానిపాలెం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 16న మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో బీవీ రమణమూర్తి తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశం ఇన్‌చార్జి ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు అధ్యక్షతన జరుగుతుందని, మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కార్యదర్శులు, ఆయా సొసైటీ అధ్యక్షులు, సంబంధితాధికారులు పాల్గొనాలని తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్‌లు స్వాధీనం

బాపట్ల రూరల్, జూలై 14 : బాపట్ల మండలం నందిరాజుతోట గ్రామంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్న ఒక ఎక్స్‌కవేటర్‌ని, రెండు ఇసుకట్రాక్టర్‌లను బాపట్లరూరల్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ శ్రీహరి మాట్లాడుతూ బాపట్ల మండలంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దుండివారిపాలెంలో గృహం దగ్ధం

కర్లపాలెం, జూ లై 14 : మండలంలోని దుండివారిపాలెం పంచాయతీ అక్కిరాజు దిబ్బకాలనీలోని ఏసు, జ్యోతిలకు చెందిన పూరి గృహం పూర్తిగా కాలిబూడిదైంది. ఇంటిలో గృహ యజమానులు లేని సమయంలో ప్రమాదం సంభవించింది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.



పూర్తిగా కాలిబూడిదైన గృహం



భట్టిప్రోలులో పూజలందుకున్న గంగమ్మ తల్లి

భక్తిశ్రద్ధలతో గంగమ్మతల్లి కొలుపులు

భట్టిప్రోలు, జులై 14 : భట్టిప్రోలు గ్రామం గిలకలబావి వద్ద ఉన్న శ్రీ గంగమ్మ తల్లి కొలుపులను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొలుపులను పురస్కరించుకుని శనివారం అమ్మవారిని పవిత్ర నదీ జలాల్లో పుణ్యస్నానాలను ఆచరించి దేవస్థానానికి తీసుకువచ్చారు. నదీ జలాల నుంచి అమ్మవారిని మంగళవాయిద్యాలు, కనకతప్పెట్లు డీజే శబ్దాల మధ్య ఊరేగింపుగా యువకులు కేరింతలు కొడుతూ గులాలు చల్లుకుంటూ గ్రామోత్సవం నిర్వహిస్తూ దేవాలయానికి చేర్చారు. ఆదివారం ఉదయం గంగమ్మతల్లికి నైవేద్యాలు, పొంగళ్ళు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గంగమ్మతల్లి కొలుపులను యాదవ సంఘీయులు పర్యవేక్షణ గావించారు.

వెద నాటు వేసిన రైతుల్లో ఆందోళన

అమృతలూరు, జూలై 14 : మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో భాగంగా రైతులు వరి నారుమళ్లు పోయడంతోపాటు, వెద సాగు చేపట్టారు. ఈ క్రమంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో పంట పొలాలు నీట మునిగాయి. దీంతో నారుమళ్లు పోసిన, వెద సాగు చేపట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే వరి నారు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.



పెదపూడి వద్ద నీటి మునిగిన వరి వెద పొలాలు

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట జూలై 14: వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శ్రీవెంకటేశ్వర యోగ సేవ కేంద్రం సభ్యులు అన్నదానం చేశారు. స్థానిక గాంధీనగర్‌లోని షిరిడి సాయి వృద్ధాశ్రమంలో ఆదివారం ఎస్‌వీ యోగా సభ్యుడు గరికిపర్తి కాశీదేవర 7వ వర్ధంతి సందర్భంగా వారి తల్లి సునీత మరియు కుటుంబ సభ్యులు ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను అందజేసి, ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, తన్నీరు శంకర్, శ్రీనివాస్, అనూష, వజ్రాల రామలింగాచారి, కోటేశ్వరావు, మురళి, భారతి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న గ్రంథాలయ భవనం

● స్లాబ్ పెచ్చులూడిపడుతున్న వైనం

● తడిసి దెబ్బతింటున్న పుస్తకాలు, సామగ్రి

వేమూరు, జూలై 14 : వేమూరులోని జిల్లా గ్రంథాలయ సంస్థకు చెందిన బ్రాంచ్ గ్రంథాలయ భవనం పూర్తిగా దెబ్బతింది. స్లాబు పెచ్చులూడిపోవడంతో పాటు గోడలు నిలువునా పగిలిపోయాయి. దీంతో వర్షం వచ్చినప్పుడు కానీ, ఇతర రోజుల్లో కానీ పెచ్చులూడి పడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పాఠకులు కూడా రావడం మానేశారు. వర్షపు నీరు లోపలికి పడడం వల్ల విలువ కలిగిన పుస్తకాలు, సామగ్రి తడిసి దెబ్బతిన్నాయి. 1986 ఆగస్టు 10వ తేదీన ఈ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఆనాడు సొంత స్థలం గాని, సొంత భవనం కానీ లేకుండా గ్రామ పంచాయతీ భవనానికి పక్కనే ఉన్న భవనం కూడా పంచాయతీకి సంబంధించిందే కావడం వల్ల ఆనాటి ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సంబంధించిన భవనాన్ని గ్రంథాలయ నిర్వహణకు మౌఖిక ఆదేశాలతో స్వాధీనపరిచారు. గ్రంథాలయానికి సంబంధించిన సొంత భవనం కాకపోవడం వల్ల మరమ్మతులకు కానీ, నూతన భవన నిర్మాణానికి కానీ నిధులు మంజూరు కావడం లేదు. ఇక్కడ పని చేసేందుకు వస్తున్న సిబ్బంది పంచాయతీ భవనాన్ని గ్రంథాలయ సంస్థకు రాయాలని విన్నవించుకున్నప్పటికీ పంచాయతీ నిర్వహణకు తమ పరిధిలో ఉన్న భవనం చాలని కారణంగా ఇబ్బందులు పడుతున్నామని గ్రంథాలయానికి అప్పగించిన భవనం వదిలి పెట్టేందుకు అవకాశం లేదంటూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమాధానపరుస్తున్నారు. దీంతో గ్రంథాలయ నిర్వహణ కష్టతరమైంది. కలకత్తాకు చెందిన రాజా రామ్మోహన్ రాయ్ ఫౌండేషన్ ద్వారా గతంలో సర్వే నిర్వహించారు. పంచాయతీ భవనాన్ని సంస్థకు స్వాధీనపరిస్తే ప్రత్యేక నిధుల ద్వారా భవన నిర్మాణం చేపడతామని హామీ ఇవ్వడం జరిగింది. అందుకు స్థానికంగా ఎలాంటి స్పందన లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసరంగా గ్రంథాలయ నిర్వహణకు పక్కా భవన నిర్మాణం అవసరం. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రంథాలయ సొంత భవన నిర్మాణానికి సొంత స్థలంతో పాటు భవన నిర్మాణానికి కూడా సహకరించాలని పాఠకులు కోరుతున్నారు.



వేమూరులో శిథిలావస్థకు చేరిన బ్రాంచ్ లైబ్రరీ భవనం



పెచ్చులూడి పడిన స్లాబ్

చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

● కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలాజీ

భట్టిప్రోలు, జూలై 14 : చేనేత సహకార సంఘాలకు సంబంధించి పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల నెల్లూరు జిల్లాలో జరిగిన ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సమావేశంలో చేనేత కార్మికులు, పరిశ్రమ ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు. దశాబ్ద కాలంకు పైగా చేనేత సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలు జరగకపోవడంతో ఆయా సంఘాలు కార్మికులకు ఉపాధిని కల్పించలేకపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున తక్షణమే సహకార సంఘాలకు పాలకవర్గ ఎన్నికలను నిర్వహించాలని ఆయన కోరారు. జౌళి శాఖ నుండి చేనేతను విడదీసి రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.1000 కోట్ల రూపాయిలు కేటాయించాలని, చేనేత సహకార సంఘాలకు వివిధ రాయితీల రూపంలో ప్రభుత్వం చెల్లించవలసిన బకాయిలను చెల్లించి సహకార సంఘాలను ఆర్థికపరంగా ఆదుకోవాలన్నారు. చేతి వృత్తులను పరిరక్షించేందుకు ఆదరణ పథకాన్ని పునరుద్ధరించి పూర్తి పరికరాలను ఆయా వృత్తిదారులకు అందించాలంటూ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగిందని ఆయన చెప్పారు. అదేవిధంగా 11 రకాల చేనేత వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేసి చేనేత ఉత్పత్తులకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించాలని చేనేతలకు ప్రత్యేక బ్యాంకులను ఏర్పాటు చేసి సబ్సిడీ రుణాలను అందించి చేనేత కార్మికుల జీవన ఉపాధికి తోడ్పాటును అందించాలని అర్హులైన చేనేత కార్మికులకు వర్క్‌షెడ్లు ఉచితంగా నిర్మించి ఇవ్వాలని, చేనేతకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించాలని, నేతన్న నేస్తం నగదును రూ.36వేలకు పెంచి మగ్గం నేసే ప్రతి కార్మికునికి వర్తింప జేయాలని బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు కొడాలి రామకోటేశ్వరరావు, జి. లక్ష్మీ, కె. వీరమోహనరావు, వంగర శ్రీనివాసరావు, బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆలయ మరమ్మతులకు మార్గమే లేదా?

● అధికారుల పర్యవేక్షణా లోపం అంటున్న భక్తులు

అమృతలూరు, జూలై 14 : అమృతలూరులోని శ్రీ అమృతేశ్వరస్వామి ఆలయ ప్రధాన గర్భాలయం వెనుక భాగంలో రాయి బయటకు రావడంతో భక్తులు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు.



ఆలయ వెనుక భాగంలో బయటకు వస్తున్న రాయి

ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో సుమారు 7 సంవత్సరాల క్రితం ఆలయ పునఃనిర్మాణం గ్రామస్థులు చేపట్టారు. ఇందుకోసం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గ్రామస్తులు 14 లక్షలు ఇవ్వగా అప్పటి ప్రభుత్వం మరో రూ.26 లక్షలు కలిపి మొత్తం రూ.40 లక్షలు ఇచ్చింది. దీనికి తోడు గ్రామస్తులు, ఎన్నారైల నుంచి భారీగా విరాళాలు వచ్చాయి. దీంతో ఆలయాన్ని సుమారు కోటి రూపాయలతో పునఃనిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణం 2018వ సంవత్సరంలో పూర్తి చేయడం జరిగింది. ఈ ఆలయంలో ప్రధానంగా గర్భాలయం, ఉపాలయాలను, ఆలయ మండపాన్ని రాతి కట్టడంతో నిర్మాణం చేశారు. ఈ నిర్మాణం లోటు పాట్లు ఉండటం వలన స్వామివారి ప్రధాన ఆలయం వెనుక భాగంలో రాయి బయటకు నెట్టివేయబడింది. గతంలో కొద్దిగా బయటకు వచ్చిన ఈ రాయి ప్రస్తుతం దాదాపు పూర్తి స్థాయిలో బయటకు వస్తుంది. దీంతో ఆలయానికి ఏమైనా ప్రమాదం జరుగుతుందా అని భక్తులు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. దీనికి తోడు అప్పటి ఆలయ నిర్మాణ కమిటికి ఆలయ అధికారులు అవగాహన కల్పించకపోవడంతో ఆలయ నిర్మాణంలో పలు లోపాలు అనతి కాలంలోనే బయటపడ్డాయి. ఆలయం ఎదురు ఏర్పాటు చేసిన మండపం కూడా వర్షం పడినప్పుడు నీరు ఇంకుతుంది. గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా ఆలయ ట్రస్టు బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ అలంకార ప్రాయంగా మారిందే తప్ప గుడి అభివృద్ధిపై ఏమాత్రం చర్యలు తీసుకోలేదని భక్తులు విమర్శిస్తున్నారు. గత ఏడాది ప్రభుత్వం పలు ఆలయ మరమ్మతులు, అభివృద్ధికి కావలసిన నిధులు మంజూరుకు అనుమతులు ఇచ్చింది. ఆ దశలో పలు ఆలయాలకు నిధులు మంజూరయ్యాయి. కాని ఇక్కడ ఆలయ అభివృద్ధికి, మరమ్మతులకు ఎలాంటి ప్రతిపాదనలు కమిటీ పంపలేదు. దీంతో ఆలయ మరమ్మతులు చేసే మార్గమే లేదా అని భక్తులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆలయ మరమ్మతులు చేయాలని భక్తులు కోరుతున్నారు.

వర్షం కురిస్తే.. కోడిపర్రు జలమయం

● రోడ్లు, ఇళ్ల మధ్యలో నిలుస్తున్న మురుగు, వర్షపు నీరు

● నిధులు మంజూరైనా నిర్మాణాలు చేపట్టని వైనం



కోడిపర్రులో ప్రధాన రహదారిపై నిలిచిన మురుగు, వర్షపు నీరు

వేమూరు, జూలై 13 : మండలంలోని గ్రామాల్లో కోడిపర్రు గ్రామం ఒకటి. ఈ కుగ్రామంలో అభివృద్ధి లేక కునారిల్లుతోంది. ప్రధానంగా రోడ్లు బాగా పల్లంగా ఉండటంతో పాటు మురుగునీరు, వర్షపు నీరు బయటకు వెళ్ళే మార్గం లేకుండా ఉంది. మరి ముఖ్యంగా మురుగు కాలువల నిర్మాణాలు లేవు. దీంతో మురుగు కాలువల పూర్తిగా నిండిపోయి ఆ మురుగంత రోడ్లపైకి, ఇళ్ల మధ్యలోకి చేరుతుంది. వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు కూడా స్తంభిస్తుంది. మురుగు కాలువలు పూర్తిగా పూడిపోవడంతో పాటు చెత్తాచెదారం పిచ్చి మొక్కలు, అడ్డుపడి నీరు బయటకు పారుతుంది. ఈ పరిస్థితుల్లో ఇక్కడ నివశించే ప్రజలు దుర్గంధం మధ్యలో దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. కొందరు రోగాల బారీన పడి దెబ్బతింటున్నారు. 2022లో మురుగు కాలువల నిర్మాణాలకు రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయి. నాటి శాసన సభ్యులు సరైన దృష్టి పెట్టకపోవడంతో కాంట్రాక్టర్లు, ముందుకు రాక ఆ నిధులు మురిగిపోయాయి. వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా కూడా పని చేసిన నాగార్జున గ్రామాన్ని బాగు చేస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఆ హామీని తుంగలో తొక్కి మాట తప్పారని మాజీ సర్పంచ్ కొంగల డానియేల్ సువర్ణరాజు అన్నారు. పంచాయితీరాజ్‌శాఖ ఇప్పటికైనా ప్రత్యేక చర్యలు చేపట్టి సహకరించాలని కోరారు.

125 మంది రోగులకు వైద్య పరీక్షలు

రేపల్లె, జూలై 14 : పేద ప్రజలకు సేవలను అందించటంలో పిట్టలవారిపాలెంకు చెందిన కేర్ ఆయుర్వేద హోమియోపతి సేవలు అభినందనీయమని భగవాన్ శ్రీసత్యసాయి సేవా సమితి కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు అన్నారు. రేపల్లె పట్టణంలో సత్యసాయిసేవాసమితి కార్యాలయంలో ఆదివారం పిట్టలవారిపాలేనికి చెందిన కేర్ ఆయుర్వేద హోమియోపతి ఫిజియోథెరపి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. 125మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సూర్యవంశి, బ్రాహ్మణి, సమీర్‌సత్యసౌమ్య పరీక్షలు నిర్వహించారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బాలుర వసతి గృహం శిథిలం..!

- ఏడాదిగా చేరని ఒక్క విద్యార్థి
- ప్రాణాలకు రక్షణ లేదంటున్న తల్లిదండ్రులు
- పై కప్పు ఊడి పడుతుండడంపై ఆందోళన
- మూతపడిన వైదన హాస్టల్
- నాడు వందమందితో కళకళ.. నేడు వెలవెల
- మండల కేంద్రానికి తరలించి.. అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి




మూతపడిన సాంఘిక సంక్షేమ వసతి గృహం..గదిలో పడిపోతున్న పైకప్పు అచ్చులు..కూలిన ప్రహరీ గోడ

బల్లికురవ, జూలై 14 : ఒకప్పుడు వంద మంది విద్యార్థులతో కళకళలాడిన వైదన సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం నేడు శిథిలావస్థకు చేరి విద్యార్థులు లేక వెలవెలబోతుంది. కొంత కాలం నుంచి వసతి గృహం మరమ్మతులు చేయిస్తామని చెప్తున్న అధికారులు పట్టించుకోక పోవడంతో ఈ ఏడాది ఒక్క విద్యార్థి కూడా వసతి గృహం వైపు కన్నెత్తి చూడకపోవడంతో పూర్తిగా మూత పడింది. ఈ వసతి గృహాన్ని బల్లికురవ మండల కేంద్రానికి తరలిస్తే మరలా విద్యార్థులతో కళకళ లాడుతుందని పలువురు అంటున్నారు.

బల్లికురవ మండలంలోని వైదన గ్రామంలో 1989లో అప్పటి ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ, బీసీ విద్యార్థుల కోసం సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని సుమారు 12 గదులతో ఎంతో అధునాతన వసతులతో ఒక అంతస్తు వేసి గదులను నిర్మాణం చేసి ప్రారంభించారు. వైదన గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఈ వసతి గృహంలో ఉండి ఉదయం సాయంత్రం తిరిగి పాఠశాలలకు వెళ్లేలా వసతులు ఏర్పాటు చేశారు. వంద మంది విద్యార్థులకు సరిపడా వసుతులు కల్పించారు. మొదట్లో విద్యార్థులతో ఎంతో కళకళలాడిన వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఎవరు హాస్టల్‌కు రాకపోవడంతో ఇప్పుడు విద్యార్థులు లేక మూత పడింది. గత ఏడాది 15 మంది విద్యార్థులతో పనిచేసిన వసతి గృహం ఈ ఏడాది మాత్రం విద్యార్థులు చేరకపోవడంతో పూర్తిస్థాయిలో అధికారులు మూసి వేశారు. వసతి గృహం పై కప్పు అచ్చులు ఊడి పడుతున్నాయని అలానే ప్రహరీ గోడ కూడా పడి పోయిందని మురుగు దొడ్లు కూడా సరిగా లేవని రాత్రి అయితే చుట్టూ ఉన్న ముళ్ల పొదల్లో నుంచి పాములు వస్తున్నాయని అందుకే తమ పిల్లలకు రక్షణ ఉండదని భయపడి వేరే ప్రాంతానికి తీసుకు వెళ్లి అక్కడ వసతి గృహంలో చేర్పించామని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. వైదన వసతి గృహం అందుబాటులో ఉంటే వలస పనులకు వెళ్లే బల్లికురవ మండల ప్రజలకు తమ పిల్లలను అక్కడ చేర్చి తమ పనులకు వెళ్లే సౌలభ్యం ఉందని ఇప్పుడు వసతి గృహం మూసి వేయడంతో పలువురు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎంతో పేరు ఉన్న వైదన వసతి గృహాన్ని మూసి వేయడం పట్ల కొందరు అధికార్ల తీరును తప్పు పడుతున్నారు. ఇంత కాలం నుంచి మరమ్మతులు చేయించ కుండా ఏమి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే వసతి గృహానికి మరమ్మతులు చేసి విద్యార్థులకు ఉపయోగ పడేలా వసతి గృహాన్ని అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మండల కేంద్రానికి వసతి గృహాన్ని తరలిస్తే విద్యార్థుల వచ్చే అవకాశం వైదన గ్రామంలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని బల్లికురవకు తరలిస్తే ఎక్కువ మంది విద్యార్థులు ఉపయోగించుకునే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. బల్లికురవకు చుట్టుపక్కల ఎక్కువ గ్రామాలు దగ్గర దగ్గర ఉన్నాయని బల్లికురవలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 500 మంది విద్యార్థులు చదువుతున్నారని వారిలో కొందరు వసతి గృహంలో చేరేందుకు ఆసక్తిగా ఉన్నారని తక్షణమే అధికారులు పరిశీలించి వెంటనే వసతి గృహాన్ని బల్లికురవలో ప్రాంభించే చర్యలు చేపట్టాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.


శిబిరంలో పాల్గొన్న వైద్యులు

140 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ఇంకొల్లు, జూలై 14 : మండలంలోని గంగవరంలో మంచాల వెంకటరామయ్య రంగమ్మ కల్యాణ మండపంలో గంగవరం ఆరోగ్య, సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు డాక్టర్ సాంబయ్య వైద్య పరీక్షలు చేసి సూచనలు ఇచ్చారు. గ్రామానికి చెందిన కరి రామయ్య స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు 140 మంది రోగులకు కేవలం రూ.200కే నెలకు సరిపడా మందులు అందజేసేందుకు ఆర్థిక సాయం అందజేసారు. ఈ సందర్భంగా దాతలను గ్రామస్థులు అభినందించారు. ఈ శిబిరంలో క్యాంపు కన్వీనర్ కరి బాలచంద్రం, కందిమళ్ల రామకోటేశ్వరరావు, కరి కమలేశ్వరరావు, సుబ్బారావు, జగన్నాథం, జ్యోతి సహకరించారు.

నీటి వృథాపై ప్రజల ఆగ్రహం


పర్చూరు - కారంచేడు మధ్య పైప్ లైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

పర్చూరు, జూలై 14 : ఓ పక్క నీటి ఎద్దడి.. మరో పక్క అడుగంటిన చెరువులతో నీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్న తరుణంలో ఉన్న కొద్దిపాటి నీరు ఇలా వృథాగా కాలువల పాలు కావడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా నీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోక పోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది కొంత మంది అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా నీటి కష్టాలు తలెత్తుతున్నాయని ప్రజలు అంటున్నారు. కొమ్మమూరు కాలువ నుంచి నాలుగు కోట్ల పైపలైన్ ద్వారా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం పైపు లైనుకు చేరే నీరు ఇలా వృథాగా పోవడమే ఇందుకు నిదర్శనం. ఈదృశ్యం ఆదివారం కారంచేడు - పర్చూరు మధ్య కన్పించింది.

నేతన్నల సమస్యల పరిష్కారానికి ప్రణాళిక

- ఎమ్మెల్యే కొండయ్య
- ఘనంగా సన్మానించిన మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు


ఎమ్మెల్యే కొండయ్యకు వినతిని ఇస్తున్న మాస్టర్ వీవర్స్ వెల్ఫేర్ ప్రతినిధులు

చీరాల, జూలై 14 : సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ధైర్యం చెప్పారు. నియోజకవర్గంలో చేనేత రంగానికి సంబంధించి మాస్టర్ వీవర్లు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం చంద్రబాబు, చేనేత, జౌళి శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. మండల పరిధిలోని జాండ్రపేటలో ఆదివారం దేవాంగ కల్యాణ మండపంలో మాస్టర్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి కొండయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొండయ్యను అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ నేతన్నలకు సంబంధించిన అన్ని సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. అంతకు ముందు పలువురు మాస్టర్ వీవర్లు నియోజవకర్గంలో సుమారు రూ.50 కోట్ల విలువైన వస్త్రాల నిల్వలు కొనుగోళ్లు జరగక పేరుకు పోయాయని వివరించారు. ఆ అంశంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే కొండయ్య వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాస్టర్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సిద్ధి బుచ్చేశ్వరరావు, గుంటి ఆంజనేయులు, బట్ట శ్రీను, గుంటి వెంకయ్య, బట్ట సురేష్, పసుమర్తి మల్లికార్జున, బి. భాస్కర్, వి.రాజ, సజ్జా లెనిన్, బట్ట రాంబాబు, సుబ్రమణ్యం, ప్రసాద్, హరికృష్ణ, శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల పంపిణీ

తెల్లగాంధీ బొమ్మ సమీపంలోని భావనా రుషి స్వామి వారి ఆలయంలో ఆదివారం పద్మశాలీయ బహుత్తమ సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్పులను కొండయ్య అందజేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, సభ్యులు, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలేరమ్మ గుడిలో పూజలు

మండల పరిధిలోని తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారి గుడి వద్ద ఆదివారం నిర్వహించిన కొలుపులు కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని కొండయ్య అమ్మవారిని కోరుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అన్నీ గుంతలే..!

- అధ్వానంగా ఆర్అండ్‌బీ రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


భవానీ సెంటర్‌లో దర్శి రోడ్డు వైపు ఏర్పడ్డ గోతులు

అద్దంకి, జూలై 14 : అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్‌లో గోతులతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో గోతులలో నీరు నిలిచి కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని భవానీ సెంటర్ నుంచి దర్శి రోడ్డు ప్రారంభం అవుతుంది. దర్శి రోడ్డు ప్రారంభంలో వాహనాల వేగనిరోధానికి స్పీడు బ్రేకర్ ఉంది. అక్కడే పెద్ద గోతులు పడ్డాయి. ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డుగా ఉన్న దర్శి రోడ్డులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి, అదీ నిత్యం రద్దీగా ఉండే భవానీ సెంటర్ అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవటం విమర్శలకు తావిస్తుంది. ప్రధానంగా అద్దంకి పట్టణంలోని దర్శి రోడ్డులో సైడ్ డ్రైన్‌లు సరిగ్గా లేకపోవడంతో వర్షపు నీరు సులువుగా ప్రయాణించే వీలు లేక తారు రోడ్డు మీద నిలిచి తరచూ గోతులుగా మారుతున్నాయి. నామ్ రోడ్డు, దర్శి రోడ్డు కలిసే కూడలి ప్రాంతంలో సీసీ రోడ్డుగా మార్చాల్సిన అవసరం ఉంది. గ్రామీణ రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడే

పంగులూరు : మండల కేంద్రమైన పంగులూరు ప్రధాన రహదారి చినుకు పడితే చిత్తడవుతుంది. కొద్దిపాటి వర్షం పడినా ప్రధాన కూడలిలో రోడ్డుకు ఇరువైపులా నీరు నిలిచి మడుగును తలపిస్తుంది. నీరు నిలిచి బురదమయమవుతున్న రహదారిపై ప్రజలు రాకపోకలు సాగించడం కష్టంగా ఉంది. ఎదురెదురుగా వచ్చే వాహనాల వేగానికి చింది పడే నీటితో రోడ్డు ప్రక్కన నడిచే వారు ఇబ్బంది పడుతున్నారు. బస్సులు నిలిచే ఈ ప్రదేశంలో ప్రయాణికులు వాహనం ఎక్కాలన్నా, దిగాలన్నా తీవ్ర యిబ్బందులు పడుతున్నారు. రెండున్నర దశాబ్దాల కిందట ప్రధాన రహదారిలో నిర్మితమైన సీసీ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ ఏర్పాటు లేకపోవడంతో వర్షపు నీరు రోజుల తరబడి రోడ్డుకు ఇరువైపులా నిలిచి మురుగును తలపిస్తుంది. ఇదే రోడ్డులో పలు చోట్ల ఏర్పడిన గోతులు రాకపోకలకు అంతరాయంగా ఉంది. మండల కేంద్రం కావడంతో పలు గ్రామాల ప్రజలు నిత్యం వివిద పనుల నిమిత్తం రాకపోకలు సాగించడం, వాహనాల రద్దీ అధికంగా ఉండటం, ప్రధాన కూడలిలో ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయాల మధ్య పాదచారులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకుంది. ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టి గుంతలకు మరమ్మత్తులు చేపట్టి తమ ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఉప్పలపాడులో రోడ్డు దుస్థితి .. పంగులూరులో రోడ్డుపై నిలిచిన నీరు


పర్యాటకులను హెచ్చరిస్తున్న శివకుమార్

తీరంలో ఎస్ఐ గస్తీ

పర్యాటకులకు జాగ్రత్తలు చెపూ్త అప్రమత్తం

వాడరేవు(చీరాలటౌన్), జూలై 14 : ఒక వైపు వరుస మరణాలు, మరోవైపు వీకెండ్‌కు పోటెత్తిన పర్యాటకులు. దీంతో అదుపు చేసేందుకు ఈపూరుపాలెం ఎస్ఐ శివకుమార్ బెత్తం పట్టక తప్పలేదు. వివరాల్లోకి వెళితే.. చీరాల పరిధిలోని వాడరేవు, రామాపురానికి నిత్యం పర్యాటకులు పెద్దఎత్తున వస్తుంటారు. ఇక వారాంతమైతే చెప్పనవసరం లేదు. సముద్రతీరంలో పర్యాటకులతో సందడి సందడిగా ఉంటుంది. ఇటీవల పెద్ద సంఖ్యలో యువకులు మృత్యువాత పడడంతో జిల్లా స్థాయి అధికారులు, పాలకులు ఆదేశాలతో కొద్దిరోజులు సముద్రంలోకి నిషేధాజ్ఞలు విధించారు. కానీ దూర సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వచ్చి అసంతృప్తితో తిరిగి వెళ్లిపోయారు. ఇదే సమయంలో అధికారులు పటిష్ట జాగ్రత్తలు చేపట్టి గత రెండు రోజుల నుంచి అనుమతులు కొనసాగించారు. ఈక్రమంలో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. పిల్ల జెల్లా తేడా లేకుండా సముద్రంలోకి దిగి ఆనందించారు. దీంతో గత పరిస్థితులు కొనసాగకుండా ఉండేందుకు, ప్రజా క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఎస్సై బెత్తం పట్టక తప్పలేదు. తమదైన శైలిలో విధులు నిర్వహిస్తూ ఆదివారం సుఖాంతం చేశారు. ఆయన వెంట పలువురు స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ తీగలు చోరీ


వేటపాలెం, సంతరావూరు మధ్య పొలాల్లో కత్తిరించిన తీగలు

వేటపాలెం(చీరాల), జూలై 14 : వేటపాలెం, సంతరావూరు మధ్య వారాట పొలాల్లో బొబ్బర్లదిబ్బ వద్ద సుమారు ఏడు విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లు చోరీకి గురైనట్లు రైతులు ఆదివారం విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దిబ్బ పొలాలు సుమారు 200 ఎకరాలు ఉంటాయి. వాటికి నీరు అందించేందుకు మోటారు, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అందుకు సంబంధించిన విద్యుత్ లైన్‌లోని తీగలను దొంగలు కత్తిరించి తీసుకెళ్లారు. గతంలో కూడా దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగితీగను దొంగలించారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రైతులు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు.

బాలుడి కిడ్నాప్ అవాస్తవం

మార్టూరు, జూలై 14: మార్టూరు గ్రామంలో శనివారం కరణం మన్నన్ అనే 10 ఏళ్ల బాలుడ్ని గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారన్న సంఘటన పూర్తిగా అవాస్తవమని సీఐ రాజశేఖర్ రెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. ఇంటి నుంచి బయటకు ఆడుకోవడానికి వెళ్లిన మన్నన్ 40 నిమిషాల తర్వాత ఇంటికి వచ్చారన్నారు. అయితే అప్పటిదాకా ఎక్కడకు వెళ్లావని తల్లి తండ్రులు కొడతారని భయపడిన మన్నన్ తనను గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించగా తప్పించుకొని వచ్చానని తల్లి తండ్రులకు చెప్పాడన్నారు. తమ విచారణలో అది తేలిందన్నారు.

అమ్మ ఆశ్రమానికి ఆర్థిక సాయం

మార్టూరు, జూలై 14 : అమ్మ ఆశ్రమ నూతన భవన నిర్మాణానికి పల్నాడు జిల్లా నాదెండ్ల గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నల్లమోతు మధు తండ్రి సత్యనారాయణ జ్ఞాపకార్థం రూ.25 వేల రూపాయల సాయం అందచేశారు. ఆయన ఆదివారం నగదును మార్టూరులో నివసిస్తున్న తాత రాములు ద్వారా ఆశ్రమ అధ్యక్షుడు గుంటుపల్లి చందుకు అందచేశారు.

కోలలపూడిలో ద్విచక్రవాహనం దగ్ధం

మార్టూరు, జూలై 14 : కోలలపూడి గ్రామంలో శనివారం అర్థరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కుంచెపు పెద్దబ్బాయి అనే వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనాన్ని పెట్రోలు పోసి దగ్ధం చేసినట్లు తెలిసింది. రూ.లక్ష విలువైన హోండా షైన్‌ను ఇంటి ముందు ఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. కొంత సేపటి తర్వాత ఈ విషయాన్ని గమనించిన చుట్టుపక్కల వారు ఇంటిలో ఉన్న పెద్దబ్బాయికి సెల్‌ఫోన్‌లో చెప్పారు. దాంతో అతను బయటకు వచ్చి చూడగా అప్పటికే బైక్ తగులబడింది. దీనిపై ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం సాదినేని నరసింహారావు, హనుమంతరావుతో తనకు ఇంటి గోడ నిర్మాణ విషయమై గొడవ జరిగిందని, తన బైక్ దగ్ధం విషయంలో వారిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

పంగులూరు, జూలై 14 : అదుపు తప్పి కారు బోల్తా పడిన ఘటన ముప్పవరం, పంగులూరు రోడ్డులో జరిగింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో కారు కొంతభాగం దెబ్బతినగా ప్రయాణిస్తున్న వ్యక్తి క్షేమంగా బయటపడ్డాడు. పంగులూరు గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి గన్నవరపు కోటేశ్వరరావు తన ఇంటికి వచ్చిన బంధువులను ముప్పవరంలో బస్సు ఎక్కించేందుకు కారులో బయలుదేరారు. ముప్పవరంలో బంధువులను బస్సు ఎక్కించిన అనంతరం తిరుగు ప్రయాణంలో పంగులూరు వస్తుండగా సంఘం డెయిరీ వద్దకు రాగానే కారు అదుపు తప్పి ఎదురుగా ఉన్న స్తంబాన్ని ఢీకొని బోల్తా కొట్టింది. కారు నడుపుతున్న కోటేశ్వరరావు ఎలాంటి గాయలు లేకుండా క్షేమంగా బయటపడగా, కారు కొంత భాగం దెబ్బతిన్నది.

దుండగులను కఠినంగా శిక్షించాలి

అద్దంకి, జూలై 14 : తమిళనాడు బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది ఆర్మ్ స్ట్రాంగ్‌ను దుండగులు ఇంట్లోకి ప్రవేశించి హత్య చేయడం దారుణం అని, దుండగులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు మందా జోషఫ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆర్మ్ స్ట్రాంగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నక్కా కాంతారావు, జ్యోతి రమేష్‌బాబు, పులిపాటి హేబేలు, పూనూరి నరేంద్ర, మంచు హనుమంతరావు,రోషన్‌బాబు, నంబూరి రోశయ్య పాల్గొన్నారు.

నాంచారమ్మకు ఆషాడ సారె బహూకరణ


అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

పర్చూరు, జూలై 14 : పర్చూరులోని శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి ఆదివారం ఆషాడమాసం సారెను బహూకరించారు. ఆషాడ తొలి ఏకాదశకు ముందు అమ్మవారికి సారెను ఇవ్వడం ఆనవాయితీ. ఏటా ఇలా అమ్మవారికి పసుపుకుంకుమ, సారె ఇవ్వడం ద్వారా గ్రామం సుభిక్షంగా ఉంటుందని, ధన, ధాన్యాలు, స్త్రీలకు సౌభాగ్యం, పంటలు సుభిక్షంగా పండుతాయని భక్తుల నమ్మకం. అందులో భాగంగా గ్రామానికి చెందిన ఒగ్గిశెట్టి శివనాగ ప్రసాద్ నేతృత్వంలో మహిళా భక్తులు కోలాటం, భజనలు, మేళా తాళాలతో ఊరేగింపుగా బయలుదేరి అమ్మవారికి సారెను సమర్పించి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి కోటిరెడ్డి, వంశంపారంపర్య అర్చకులు తులసి వారు, భక్తులు పాల్గొన్నారు.

తిమ్మాయపాలెంవాసిగా గుర్తింపు

అద్దంకి, జూలై 14 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తి అద్దంకి మండలం తిమ్మాయపాలెంకు చెందిన పసుపులేటి నాయుడు(58)గా గుర్తించారు. నాయుడు శుక్రవారం బేల్దారి పని కోసం అద్దంకి వచ్చి రాత్రి 10 గంటల సమయంలో భవానీ సెంటర్ నుంచి తిమ్మాయపాలెం నడిచివెళ్తుండగా భవనాసి కాలువ సమీపంలో గుర్తు తెలియని ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నాయుడును 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందారు. అయితే వివరాలు తెలియకపోడంతో ఒంగోలు రిమ్స్ అవుట్ పోస్టులో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. ఆదివారం భార్య మస్తానమ్మ ఫిర్యాదు మేరకు అద్దంకి పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు.